

## కురసాల కన్నబాబుకు వైసిపి నాయకుల అభినందనలు పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులు

తరువాయి 8లో..





# ప్రజల తరపున పోరాడుతాం

- చెప్పాడంటే చేసే చేస్తాడంతే.. ఇది జగన్ శైలి
- చెప్పాడంటే ఏనాడూ చేయడంతే.. ఇది బాబు వైఖరి
- వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు వ్యాఖ్య



విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు చెప్పారు. కోఆర్డినేటర్గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆదివారం తొలిసారి పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయనకు పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్నబాబు మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇచ్చిన పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. ఉత్తరాంధ్ర చారిత్రక ఉద్యమాలగడ్డని అన్నారు. ఇటువంటి ప్రాంతాన్ని పరిపాలన రాజధానిగా చేయాలన్న సంకల్పంతో ముందుకు వచ్చిన జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని విధాల అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. గడిచిన ఎనిమిది నెలలలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదని, ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పింది దానికి, ఇప్పుడు చేస్తున్న దానికి పొంతన లేదని ఆయన విమర్శించారు. చెప్పాడంటే చేస్తాడు అంతే.. ఇది జగన్ శైలి అయితే.. చెప్పాడంటే ఏనాడూ చేయడన్నది చంద్రబాబు వైఖరి అని కన్నబాబు వ్యాఖ్యానించారు. గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి నిరుద్యోగ యువత విశాఖపట్నంలో రోడ్ ఎక్కిందని.. ఇది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయిందని ఆయన అన్నారు. ఎన్నికలకు ముందు లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేశారని.. కానీ విశాఖలో నిన్న నిరుద్యోగ యువత చేసిన ఆందోళన నిజమైన యువగళం అని ఆయన అభివర్ణించారు. చంద్రబాబు ఈ ఎనిమిది నెలల కాలంలో రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులను మోసం చేశాడని కన్నబాబు ఆరోపించారు. వీరందరికీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్రలో పార్టీ పటిష్టతకు, నాయకులంతా సమన్వయంతో పని చేస్తామని కన్నబాబు తెలియజేశారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా, జగన్మోహన్ రెడ్డి పేదలకు పక్షపాతిగా ఉంటారని ఆయన చెప్పారు. జగన్మోహన్ రెడ్డి కోట్లాది రూపాయలు అప్పులు చేశారన్న విమర్శల్లో నిజం లేదని, ఆయన ప్రజలకు చేసిన మేలు ఇప్పటికీ చెప్పుకుంటున్నారని ఆయన వివరించారు.

చంద్రబాబు నాయుడు అధికారులకు వచ్చిన తర్వాత చంద్రన్న పగ, చంద్రన్న

తరువాయి 8లో..

# జగన్ అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలి



విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త: జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వచ్చే ప్రజా సమస్యలపై మాట్లాడాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వస్తారని ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నాము అని అన్నారు. ప్రతిపక్షహోదా కావాలంటూ జగన్ అసెంబ్లీకి వెళ్తే ప్రజలు హర్షించరని కలిశెట్టి అభిప్రాయపడ్డారు. గత ఐదు సంవత్సరాలలో ప్రకృతి వనరులను నాశనం చేసినందుకు జగన్ ,వైసీపీ ఎమ్మెల్యే లు అసెంబ్లీలో ప్రజలకు క్షేమాపన చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి దోపిడీలపై అసెంబ్లీలో చర్చ జరగాలి. గత ఐదేళ్లలో వైసీపీ చేయని పనులను కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తోందని ఆయన తెలియజేశారు. గడిచిన ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న పేరు ప్రతిష్టలు చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఆయన అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవాలని ప్రత్యేక వ్యూహంతో జగన్ ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది అని అప్పలనాయుడు అభిప్రాయపడ్డారు.

## నేడు ఉపమాక వెంకటేశ్వర స్వామి కళ్యాణపు పెండ్లి రాట.!



(నక్కపల్లి ,ప్రభాతవార్త) ఉత్తరాంధ్ర కలియుగ దైవం ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా వేదమంత్రాలు నడుమ ముందుగా పెండ్లి రాట కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నిర్వహించనున్నారు. మార్చి 10వ తేదీన ప్రారంభమయ్యే వార్షిక కళ్యాణోత్సవాలు ఐదు రోజులు పాటు అంగరంగ వైభవంగా జరిపేందుకు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసినదే.! ఈ మేరకు ముందుగా ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు పూజా కార్యక్రమం అనంతరం ఈ పెండ్లి రాట కార్యక్రమం జరుగుతుంది. ఈ పెండ్లిరాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలయ అధికారులు, ప్రధాన పూజారి గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు ఆదివారం కోరారు.

## విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ కోసం
# దశలవారీగా ఆందోళనలు

**నేటి నుంచి నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు**
**ఆరు జిల్లా న్యాయవాదుల ప్రాంతీయ సదస్సు తీర్మానం**



విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త: రాష్ట్రంలో అన్ని సౌకర్యాలు ఉన్న విశాఖపట్నంలో హైకోర్టు బెంచి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ఉత్తరాంధ్ర మరియు కాకినాడ వరకూ ఆరు జిల్లాలకు చెందిన న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదివారం జిల్లా కోర్టు ఆవరణలోని నూతన బార్ అసోసియేషన్ సమావేశమందిరంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాకుళం,విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం, అనకాపల్లి,అల్లూరి,కాకినాడ జిల్లాలకు చెందిన న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విశాఖపట్నంలో ప్రిన్సిపల్ హైకోర్టు, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అడ్వకేట్ అమెండ్మెంట్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, హైకోర్టు బెంచ్ కోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు . అంతకు ముందు జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవర సత్యనారాయణ మాట్లాడుతూ హైకోర్టు బెంచ్ కోసం చేపడుతున్న కార్యాచరణలో ప్రజలను కూడా భాగస్వామ్యం చేస్తామన్నారు. 1993 నుండి ఇందుకు ఉద్యమాలు చేస్తున్నామని, ఇకపై పట్టు వీడేది లేదన్నారు. ఇందుకు స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసి తమ డిమాండ్ ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. ప్రతి న్యాయవాది హైకోర్టు కోసం తనవంతు సహకారం అందివ్వాలని వివిధ కేసుల మీద 700కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడకు వెళ్లడం చాలా కష్టమైన పనని అన్నారు. బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు కృష్ణ మోహన్ మాట్లాడుతూ 1989- 90 నుండి హైకోర్టు కోసం డిమాండ్ ఉందని ఇందుకు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు నర్సింగరావు మాట్లాడుతూ విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు జ్యుడీషియరీ సుముఖంగా ఉందని చెప్పారు. జడ్జిలను కలిసి వాళ్ల దృష్టికి ఈ ప్రాంత డిమాండ్ తీసుకువెళితే పని సులభం అవుతుందని తెలియజేశారు. భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి. పార్వతీశం మట్లాడుతూ హైకోర్టు కోసం సోమవారం నుండే లాయర్లు నల్ల బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. తుని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణ

తరువాయి 8లో..

# సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తనపై గీతంలో వర్క్‌షాప్



విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్సో, షల్ సైన్సెస్ ఆధ్వర్యంలో "సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తన" అనే అంశం పై ప్రమోషన్ ఆఫ్ అకాడమిక్ రీసెర్చ్ కొలాబరేషన్ (స్పార్క్) వర్క్‌షాప్ నిర్వహించారు. భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ సహకారంతో స్పార్క్ పథకంలోని ఐ.ఐ.టి. ఖరగ్‌పూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో

తరువాయి 8లో..



ఆనందపురం మండలం గిడిజాల గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ శ్రీభరత్ హాజరయ్యారు. సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆనందపురం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లాలో ప్రశాంతంగా
# గ్రూప్-2 పరీక్షలు

**16 కేంద్రాల వద్ద పటిష్ట భద్రత**
**ఉదయం 85.14%, మధ్యాహ్నం 84.95 % మంది అభ్యర్థుల హాజరు**
**వివిధ కేంద్రాల్లో పరీక్ష జరిగిన తీరును పరిశీలించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్**



విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలో నిర్వహించిన గ్రూప్-2 ప్రధాన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. అభ్యర్థులంతా ఆయా కేంద్రాల్లో పరీక్షలను ప్రశాంత

తరువాయి 8లో..

## దేశ ప్రయోజనాలకు
# అనుగుణంగా కేంద్ర బడ్జెట్

**కుంభకోణాల రహిత దేశంగా భారత్ - కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ**
**కేంద్ర బడ్జెట పై మేధావుల సమావేశంలో వెల్లడి**



విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త: దేశ ప్రయోజనాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ను ప్రవేశపెట్టామని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ చెప్పారు. ఈ ఏడాది ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పై విశాఖలో మేధావులు సమావేశం ఆదివారం

తరువాయి 8లో..

## మయన్మార్‌లో చిక్కుకున్న బూరుగుపాలెం యువకులు

**స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో స్వదేశానికి బాధితులు**





తరువాయి 8లో..



## బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

వివరాలు 8లో..



## ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం
### గంటా రవితేజ

- వార్త 8లో..



## జనసేన శాసనసభ పక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మిగతా 8 లో..

## జిల్లాలో ప్రశాంతంగా

# గ్రూప్-2 పరీక్షలు

(7వ పేజీ నుంచి తరువాయి)

వాతావరణంలో రాశారు. పరీక్షకు రెండు రోజుల ముందు జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం తగు జాగ్రత్తలు తీసుకుంది. జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. నిర్దేశిత సమయానికి అభ్యర్థులంతా కేంద్రాలకు చేరుకోవటం కనిపించింది. ఉదయం 6.30 గంటలకే లైజన్ అధికారులు సంబంధిత మెటీరియల్ తో కేంద్రాలకు చేరుకున్నారు. ఏపీపీఎస్సీ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రకాల ముందుస్తు చర్యలు చేపట్టారు. అన్ని రకాల నిబంధనలు పాటిస్తూ పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూమ్ ల నుంచి పోలీసు భద్రత నడుమ పరీక్షా కేంద్రాలకు తరలించారు. అధికారులు తీసుకున్న నిర్ణయాలు, చేసిన పటిష్ట ఏర్పాట్ల ఫలితంగా జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్ - 2 ప్రధాన పరీక్ష అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిసింది.

**కంట్రోల్ రూమ్ ల ద్వారా పర్యవేక్షణ**

గ్రూప్-2 ప్రధాన పరీక్షను సజావుగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తగిన చర్యలు తీసుకున్నారు. ఒక రోజు ముందుగానే జాయింట్ కలెక్టర్ అన్ని కేంద్రాల తాలూక పరిస్థితులను తెలుసుకొని జిల్లా కలెక్టర్ కు నివేదించారు. ముందు రోజు రాత్రి జరిగిన ఆందోళనల నేపథ్యంలో సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్లతో పర్యవేక్షణ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి డ్రోన్లను ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ సాయంతో పర్యవేక్షించారు. జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయటమే కాకుండా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అన్ని పరీక్షా కేంద్రాలను కెమెరాలతో అనుసంధానం చేస్తూ డ్యాష్ బోర్డుతో కూడిన కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా పరిస్థితిని సమీక్షించిన జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ ఎప్పటికప్పుడు కలెక్టర్ కు నివేదించారు.

**ఉదయం వచ్చిన వారిలో 21 మంది మధ్యాహ్నం గైర్హాజరు**

గ్రూప్-2 ప్రధాన పరీక్షకు జిల్లాలో మొత్తం 11,030 మంది దరఖాస్తు చేసుకోగా ఆదివారం ఉదయం 10.00 నుంచి 12.30 గంటల వరకు జరిగిన తొలి పేపర్ కు 9,391 (85.14 శాతం) మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3.00 నుంచి 5.30 గంటల వరకు జరిగిన రెండో పేపర్ కు 9,370 (84.95 శాతం) మంది హాజరయ్యారు. ఉదయం వచ్చిన వారిలో 21 మంది అభ్యర్థులు మధ్యాహ్నం జరిగిన పరీక్షకు హాజరుకాలేదు. కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం ఒక అభ్యర్థి బీపీ తగ్గటంతో అస్వస్థకు గురయ్యారు. అధికారులు వెంటనే స్పందించి పోలీసు భద్రత నడుమ సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

పరీక్షల నిర్వహణలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదివారం ఉదయం ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మెయిన్ బ్రాంచ్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఏయూలోని న్యూ క్లాస్ రూమ్ లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని, జైల్ రోడ్డులోని డిగ్రీ మహిళా కళాశాల, సీతంపేట పరిధిలోని బీవీకే, ప్రిజమ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి అక్కడ పరిస్థితిని పరిశీలించారు.

**విశాఖలో 16 సెంటర్లలో గ్రూప్-2 పరీక్షలు**

విశాఖ జిల్లాలో 16 ఎగ్జామ్స్ సెంటర్లలో ఆదివారం గ్రూప్-2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద విశాఖ నగర్ పోలీస్ కమిషనర్ సంకబ్రతబాక్చి ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలు భారీ పోలీసు భద్రత ఏర్పాట్లు నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12:30 వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 నుంచి 5:30 వరకు పేపర్ -2 పరీక్ష లు నిర్వహిస్తున్నారు.పరీక్షా సమయానికి 15 నిమిషాలు ముందుగా అభ్యర్థులు ఎగ్జామ్స్ సెంటర్లకు హాజరు కాగా, విశాఖ జిల్లాలో మొత్తం 16 కేంద్రాలలో 11,029 అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు అధికారులు తెలిపారు.

## కురసాల కన్నబాబుకు వైసిపి నాయకుల అభినందనలు

## పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో - ఆర్డినేటర్ గా బాధ్యతలు స్వీకరించిన మాజీ మంత్రి కురసాల కన్నబాబుకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. ఈ సందర్భంగ కన్నబాబుని పార్టీ సీనియర్ నాయకురాలు రమణకుమారి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ,విశాఖపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు,మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, నగర మేయర్ హరి వెంకటకుమారి,అరకు పార్లమెంటు సభ్యురాలు తనుజా రాణి,మాజీ డిప్యూటీ సీఎం శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్,విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు,శాసనమండలి సభ్యురాలు వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, మాజీఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు,వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

## ప్రజల తరపున పోరాడుతాం

(7వ పేజీ నుంచి తరువాయి)

దగా స్కీములు మాత్రమే అమలు చేస్తున్నారని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. చంద్రబాబు అధికారులకు వచ్చాక పేదలకు సంవత్సరాలకి 3 సిలిండర్లు ఇస్తామని చెప్పి, కేవలం ఒక సిలిండర్ తో సరిపెట్టాడని ఆయన అన్నారు. ఇది ఇలా ఉండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వదిలి వెళ్ళిపోతున్నారంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు కన్నబాబు సమాధానం చెబుతూ రాజకీయ నాయకులు పార్టీలు మారడం సర్వసాధారణం.. ఇప్పుడు వెళ్ళిన వాళ్లే మళ్ళీ తిరిగి తమ పార్టీలోకి వస్తారని కన్నబాబు ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో ఇప్పుడు ఉన్నది జగనన్న సైన్యం అది చెక్కుచెదరని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మంత్రులు ధర్మాన కృష్ణ దాస్, ధర్మాన ప్రసాదు, గుడివాడ అమర్నాథ్, తిప్పల నాగిరెడ్డి, చిన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ కోసం దశలవారీగా ఆందోళనలు

(7వ పేజీ నుంచి తరువాయి)

శేఖర్ మాట్లాడుతూ విజయవాడ కంటే దగ్గరగా ఉన్న విశాఖపట్నం లోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని చెప్పారు.మహిళ న్యాయవాది లక్ష్మీ రాంబాబు మాట్లాడుతూ కర్నూలు కంటే అన్ని విధాలా అనుకూలమైన విశాఖనగరంలోనే హైకోర్టు బెంచ్ తో పాటు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలన్నారు. సీనియర్ న్యాయవాది చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ హైకోర్టు బెంచ్ కోసం ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించాలని ఐక్యతతో డిమాండ్ సాధించుకోవాలన్నారు. న్యాయవాది మురళీమోహన్ మాట్లాడుతూ ల్యాండ్ ట్రిబ్యునల్ యాక్ట్ మాదిరిగానే హైకోర్టు కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలన్నారు. ఈ సదస్సులో పాలకొండ, బొబ్బిలి, రాజాం, చోడవరం,తుని, నర్సీపట్నం, అనకాపల్లి,గజపతినగరం,యలమంచిలి విజయనగరం ప్రాంతాలకు చెందిన న్యాయవాదులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేసారు.స్టీల్ ప్లాంట్ కార్మికుల తరహాలో హైకోర్టు కోసం ఆందోళనలు చేపట్టాలని పలువురు న్యాయవాదులు పిలుపునిచ్చారు.ఈ సదస్సులో బార్ అసోసియేషన్ కార్యదర్శి నరేష్,అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

## సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తనపై గీతంలో వర్క్‌షాప్

(7వ పేజీ నుంచి తరువాయి)

ఆన్‌లైన్ భద్రత, డిజిటల్ నైతికత, బాధ్యతాయుతమైన ఇంటర్నెట్ వినియోగం గురించి విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు రెండురోజుల పాటు అవగాహన కల్పించారు. ఆదివారంతో ముగిసిన ఈ కార్యక్రమానికి గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా హజరై ప్రసంగిస్తూ గ్లోబల్ కనెక్టివిటీ పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితిలో డిజిటల్ భద్రత ఎంత ముఖ్యమైందో వివరించారు. వర్క్‌షాప్ వ్యక్తులకు సురక్షితంగా ఇంటర్నెట్‌ను వాడే అవగాహన మరియు నైపుణ్యాలను అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని, సాంకేతికతను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుందని తెలిపారు. ఐ.ఐ.టి. ఖరగ్‌పూర్ స్పార్క్ ప్రాజెక్టు జాతీయ సంయుక్త కోఆర్డినేటర్, అంతర్జాతీయ సంబంధాల డీన్, మరియు కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ రబీబ్రత ముఖర్జీ మాట్లాడుతూ సైబర్ భద్రతా విద్య, సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తనను ప్రోత్సహించడం ద్వారా వ్యక్తులు మరియు సంస్థలను డిజిటల్ ముప్పుల నుండి రక్షించవచ్చని పేర్కొన్నారు. స్పార్క్ ప్రాజెక్ట్ రష్యన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ మరియు ఉరల్ ఫెడరల్ యూనివర్సిటీ (రష్యా) ప్రొఫెసర్ ఎడ్వర్డ్ పత్రకోవ్ ఈ వర్క్‌షాప్ ఉద్దేశాలను వివరిస్తూ, డిజిటల్ ప్రపంచాన్ని సురక్షితంగా అనుసంధానించుకునే ప్రాథమిక జ్ఞానం, నైపుణ్యాలను అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. గీతం హ్యూమానిటీస్ & సోషల్ సైన్సెస్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విభూతి సచ్దేవ్ ఆన్‌లైన్ భద్రతా సవాళ్లను ఎదుర్కొనడానికి అంతర విభాగ సహకారం ఎంతో అవసరమని సూచించారు. రష్యా నుండి డాక్టర్ లియూడ్మిలా బటురినా ప్రత్యేక ఆన్‌లైన్ సెషన్ నిర్వహించారు. "డిజిటల్ పర్యావరణం, యువతకు ముప్పులు" అనే అంశంపై ఆమె సవివరంగా మాట్లాడారు. యువత ఆన్‌లైన్‌లో ఎదుర్కొనే సైబర్ ముప్పులు, డిజిటల్ అలవాటు, సోషల్ మీడియా ప్రభావాలు వంటి అంశాలను విశ్లేషించి, వాటిని అధిగమించే వ్యూహాలను వివరించారు. సైబర్ ముప్పులు, డిజిటల్ ఆరోగ్యం, సురక్షిత, జాగ్రత్తగా ఇంటర్నెట్ వినియోగం గురించి అవగాహన కల్పించారు. 70 మందికి పైగా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని, సురక్షిత డిజిటల్ ప్రవర్తన పాటించే వ్యూహాలను నేర్చుకున్నారు. ఈ వర్క్‌షాప్‌లో గీతం హ్యూమానిటీస్ %a% సోషల్ సైన్సెస్ నుండి ప్రొఫెసర్ నళిని బిక్కినా, డాక్టర్ రవి శంకర్ దత్తి, ఉరల్ ఫెడరల్ యూనివర్సిటీ (రష్యా) నుండి డాక్టర్ ఎడ్వర్డ్ పత్రకోవ్ %a% డాక్టర్ లియూడ్మిలా బటురినా రిసోర్స్ పర్సన్లు గా పాల్గొని ఇంటరాక్టివ్ చర్చలు, కేస్ స్టడీస్, ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు.

## మయన్మార్‌లో చిక్కుకున్న బూరుగుపాలెం యువకులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం బూరుగుపాలెం గ్రామానికి చెందిన వబ్బలరెడ్డి మణికంఠతో పాటు మరో ముగ్గురు యువకులు ఉపాధి నిమిత్తం మయన్మార్ (బర్మా) వెళ్లారు. వీరిని తీసుకెళ్లిన ఏజెంట్, వాగ్దానాల మేరకు సరైన పని ఇవ్వకుండా, అనేక రకాల ఇబ్బందులు కలిగించాడు. తక్కువ వేతనంతో బలవంతంగా పనిచేయించేందుకు ప్రయత్నించడంతో, వారు స్వదేశానికి తిరిగి రావాలని భావించారు. అయితే, ఆ దేశంలో వర్క్ పర్మిట్ సమస్యలు తలెత్తడంతో వారు అక్కడే చిక్కుకుపోయారు. ఈ విషయం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి రావడంతో, ఆయన వెంటనే స్పందించి, బాధితులను రక్షించేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ని వ్యక్తిగతంగా సంప్రదించి, వారికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్పీకర్ సూచనల మేరకు, సంబంధిత అధికారులతో సమన్వయం జరిపి, బాధితుల రక్షణకు తగిన చర్యలు తీసుకున్నారు. మయన్మార్ ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపి, వీరిని తిరిగి భారతదేశానికి తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు చేయించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాధితుల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం అనుసరించిన చొరవతో, త్వరలోనే ఈ యువకులు స్వస్థలాలకు చేరుకునే అవకాశముంది.

## జనసేన శాసనసభాస పక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలలో అనుసరించాల్సిన వైఖరిపై చర్చించేందుకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మంగళగిరి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన విధి విధానాలు, పార్టీ విధానాన్ని వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో పాటు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దేశ ప్రయోజనాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్

(7వ పేజీ నుంచి తరువాయి)

జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస వర్మ మాట్లాడుతూ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అంటూ ఆర్ధిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టడం తెలుగువారికి గర్వకారణం అని అన్నారు.వికసిత్ భారత్ లక్ష్యంగా 2025-26 బడ్జెట్ ఉందిని ఆయన చెప్పారు.విద్య, వైద్యం కు ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్ ను రూపకల్పన చేయటం గొప్ప విషయమని ఆయన వ్యాఖ్యానించారు.బడ్జెట్ లో రైతులకు పెద్ద పీట వేశారని మంత్రి వర్మ వివరించారు. రైతుల పక్షపాతి ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం అని మరోసారి ఈ బడ్జెట్ ద్వారా నిరూపితమైందని ఆయన కొనియాడారు.కేంద్రంలో ఎన్ డి ఏ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి విద్య కు అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.రాష్ట్రానికి అనేక ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేస్తోందని ఆయన తెలిపారు.2025-26 బడ్జెట్ లో సమతుల్యం పాటిస్తూ అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. బడ్జెట్ లో మధ్యతరగతి వేతన జీవుడికి ఎన్ డి ఏ ప్రభుత్వం భారీ ఊరట ను ఇచ్చింది. మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత రైల్వే లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా రైల్వే లో ఆంధ్ర ప్రదేశ్ కు పెద్ద ఎత్తున కేంద్రం కేటాయింపులు చేసిందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి విశాఖ చుట్టూ తిరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రతి ఒక్కరికి సొంతింటి కళ నెరవేర్చాలనే లక్ష్యంతో ఎన్ డి ఏ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది అని ఆయన తెలియజేశారు. ఎన్ డి ఏ ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చింది. ఎన్ డి ఏ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని రంగలల్లో సమూలమైన మార్పులు వచ్చాయి. భారతదేశం కుంభకోణాల రహిత దేశంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కేంద్ర పథకాలు నత్తనడకన సాగాయని మంత్రి శ్రీనివాస వర్మ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం వాడుకోలేకపోయింది. వైసీపీ ప్రభుత్వం సహకరించకపోవడంతో రాష్ట్రంలో జల్ జీవం మిషన్ పూర్తి కాలేదు అని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, బీజేపీ నాయకులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం : గంటా రవితేజ

ఆనందపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

అవగాహనతో క్యాన్సర్ ను సమర్థంగా ఎదుర్కోవచ్చని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ అన్నారు. మండలంలోని గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెంలో ఒమేగా హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, అవగాహన క్యాంప్ అన్ వీల్స్ ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమని అనేకమంది సెలబ్రిటీలు నిరూపించారని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతగా తీసుకుని గ్రామీణ ప్రాంతాలలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలను ఒమేగా వంటి హాస్పటల్స్ నిర్వహించడం ప్రశంసనీయమని చెప్పారు. క్యాన్సర్ రహిత సమాజం కోసం అన్ని రంగాల వారు కృషి చేయాలన్నారు. బ్రెస్ట్ స్క్రీనింగ్, పాప్ స్మియర్, బీపీ, షుగర్ ఉచిత పరీక్షలు చేయించుకోవడానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, తాత్రాజు అప్పారావు, జీవన్ కుమార్, బి.ఆర్.బి. నాయుడు, చందక అప్పలరాజు, బోయి రమాదేవి పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

స్థానిక రైల్వే న్యూ కాలనీలో బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో జనరల్, లాపరోస్కోపిక్ సర్జన్ డా.యశ్వంత్ నేతృత్వంలో ఆత్మీయ వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆరోగ్యకరమైన, మెరుగైన సమాజం కోసం ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని. తెలియజేశారు. "మనం మానసికంగా బలంగా ఉన్నట్లయితే, చాలా వరకు వ్యాధులను సులభంగా ఎదుర్కొనేందుకు అవకాసం ఉంటుంది అని అన్నారు. సాధారణ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ దోమల వల్ల కలుగుతాయి, ఆహార సంక్రమణల వల్ల విరేచనాలు ఏర్పడతాయి. కానీ కొన్ని రకాల జీవనశైలి వ్యాధులు, "రక్తపోటు", "మధుమేహం", "థైరాయిడ్" వంటివి మానసిక రుగ్మతల వల్ల ఏర్పడతాయి అని డాక్టర్ వివరించారు . ఈ రకమైన జీవనశైలి వ్యాధులను నశింపజేయడం లేదా నియంత్రణలో ఉంచడం కోసం మానసికంగా బలంగా ఉండాలి. మన ఆలోచనలు మన శరీరంపై ప్రభావం చూపిస్తాయి. సానుకూల ఆలోచనలు సానుకూల ప్రభావాన్ని చూపిస్తాయి.ప్రతికూల ఆలోచనలు మన శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయి, అది సైకోసొమాటిక్ వ్యాధుల రూపంలో కనిపిస్తుంది. రాజయోగ ధ్యానం మానసిక బలాన్ని, సానుకూలతను తీసుకురావచ్చు అని చెప్పారు.

## తల్లి చెంతకు చేరిన కుమారుడు గురువయ్య



విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

కుటుంబ సమస్యల కారణంగా కొన్ని సంవత్సరాలుగా బీచ్ లో తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు సహకారంతో తల్లి వద్దకు చేర్చారు. వివరాల్లోకెళ్తే . దాసరి గురువయ్య. వయసు 40 సంవత్సరాలు. తండ్రి పేరు దుర్గయ్య (లేట్)తల్లి పేరు. కోటమ్మ ఊరు పామాడు మచిలీపట్నం జిల్లా..తల్లి చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి... గురువయ్యకు. ముగ్గురు అన్నదమ్ములు. ముగ్గురు అక్క చెల్లెలు.. గురువయ్యకు . ఒక కూతురు ఉంది. భార్య పేరు. మరియమ్మ( లేటు). భార్య చనిపోవడంతో . గురువయ్య పామాడు నుండి విశాఖపట్నం చేరుకొని 15 సంవత్సరాలవుతుంది %=.ఖ%. బీచ్ యందు భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.. నగర పోలీస్ కమిషనర్ శంఖ భద్ర భాగ్చి చూసి తక్షణం . బీచ్ పోలీస్ సిబ్బంది. కి సమాచారం అందించినారు. బీచ్ పోలీస్ సిబ్బంది పీసీ 3046. పోలిరాజు. మరియు పీసీ.3769. వివి రమణ గారు రెడ్ క్రాస్ సిబ్బందికి సమాచారం అందించినారు రెడ్ క్రాస్ సిబ్బంది వెంటనే అక్కడ చేరుకొని. . ఆయనను పెద్ద వాల్టర్ లో గల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హోం లెస్ షెల్టర్ కు తరలించారు

## కుంభమేళాకు వెళ్తున్న ప్రయాణికులు బస్సుకు ప్రమాదం

## ఐదుగురుకి తీవ్ర గాయాలు



ఆనందపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

ఉత్తరప్రదేశ్ లో జరుగుతున్న కుంభమేళాలో పాల్గొనడానికి వెళ్తున్న భక్తుల బస్సు ఆనందపురం మండలంలోని గండిగుండం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి ప్రాంతానికి చెందిన 30 మంది ప్రయాణికులు ఒక బస్సును బుక్ చేసుకుని కుంభమేళాకు వెళ్తున్నారు. ఆ బస్సు గండిగుండం వద్దకు చేరుకునేసరికి ముందుగా వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి వెనుక నుంచి లారీని బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ప్రయాణికులు లక్ష్మీదేవి, నారాయణ, డ్రైవర్ వీరయ్యతో పాటు మరో ఇద్దరు గాయపడగా చికిత్స కోసం కేజీహెచ్ కు తరలించారు. కేసును ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## గ్రూప్-2 పరీక్షల నిర్వహణలో పోలీసులు సక్సెస్..



విశాఖ క్రైం : ఫిబ్రవరి 23 ప్రభాత వార్త

ఏపిపిఎస్సీ ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షలకు విశాఖ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు ఏర్పాటు చేశారు.విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఒకరోజు ముందుగానే ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి పలువురు అధికారులతో చర్చించారు. విశాఖ జిల్లాలో మొత్తం 16 కేంద్రాలలో ఆదివారం ఈ పరీక్షలు కొనసాగాయి. సమస్యాత్మక ప్రాంతాల వద్ద ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల దగ్గర మాత్రం పట్టిష్టమైన భద్రత చర్యలు చేపట్టారు.ముందు రోజు నుంచి ఆయా పరీక్ష కేంద్రాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద కానీ సమీపంలో గాని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. శనివారం నాడే ఆయా కేంద్రాల వద్ద పోలీస్ నిఘా ను పెట్టారు. అలాగే అనుమానితులపై కూడా దృష్టి సారించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రూప్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పరంగా సిపి పలు చర్యలు తీసుకున్నారు. పరీక్షలు కొనసాగుతున్న సమయంలోనే ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అక్కడ నెలకొన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు సిపి సమీక్షించరు. సంబంధిత పోలీసు అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారు సకాలంలో పరీక్షలు రాసే విధంగా పలు చర్యలు చేపట్టారు.అభ్యర్థులకు పోలీసులు తమ పూర్తి సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే గ్రూప్ డి పరీక్షల నిర్వహణ సాగిందన్నారు.పరీక్షలు సందర్భంగా అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడటం జరిగిందన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్షల నిర్వహణపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించడం జరిగిందని పేర్కొన్నారు. విశాఖలో నిర్వహించిన ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయని వెల్లడించారు.

## ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆనందపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

ఆనందపురం మండలంలోని గిడిజాల పంచాయతీ దిబ్బడి పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహాన్ని అత్యంత వైభవోపేతంగా ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ మాన్ రేజేటి శ్రీ రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పసిడి కలశ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటు సభ్యులు శ్రీ భరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, ఘట్టమనేని కుమార స్వామి దంపతులు ఆలయ కమిటీ సభ్యులు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మందికి అన్న దానం చేశారు.

## ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో మొదలైన రెడ్డిపల్లి రోడ్డు పనులు



పద్మనాభం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:

భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో రెడ్డపల్లి రోడ్డు పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. ఈ మేరకు ప్రయాణికులు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయామాలో రెడ్డిపల్లి గ్రామంలో చిన్నాపురం వైపు శాంతినికేతన్ నుండి బంగారమ్మ అమ్మవారి ఆలయం వరకు, పద్మనాభం వైపు పద్మనాభం నుండి రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు రోడ్డు విస్తరణ చేసి, గ్రామంలో అసంపూర్తిగా వదిలేశారు. దీంతో చేపల చెరువులను తలపించే విధంగా పెద్ద గోతులు పడడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడేవారు.వర్షం లేనపుడు దుమ్ము దూళి రేగి ఇళ్లలలోకి వెళ్లడంతో రోడ్డు పక్కన నివాసం ఉన్న ప్రజలు రెండు సంవత్సరాల నుండి నానా అవస్థలు పడ్డారు. దీంతో గ్రామ ప్రజలు కూడా సంక్రాంతికి ముందు రోడ్డుపై ధర్నా కూడా చేసారు. గ్రామ ప్రజలు, ప్రయాణికుల ఇబ్బందులు దృష్ట్యా త్వరిత గతిన రోడ్డును పూర్తి చేయాలని గంటా అధికారులను ఆదేశించడంతో రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

## ప్రశాంతంగా గ్రూపు -2 మెయిన్ పరీక్ష



ఆనందపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

ఆనందపురం మండలంలోని గుడిలోవలో ఉన్న ఏక్యూజె పీజీ స్టడీ సెంటర్ లో ఆదివారం నిర్వహించిన గ్రూపు -2 మెయిన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం పేపర్ -1, మధ్యాహ్నం పేపర్ -2 పరీక్షను నిర్వహించగా 1248 మంది అభ్యర్థులకు గాను 1183 మంది హాజరయ్యారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

## పాదచారులు నడిచేదెలా..?

### ఫుట్పాతులపై వ్యాపారుల కన్ను - పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు



ఆరిలోవ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ఏటా కోట్ల రూపాయలు వేచించి పాదచారులు కోసం నిర్మిస్తున్న ఫుట్పాతులు నిర్వహణపై అటు జీవీఎంసీ అధికారులు గాని, ట్రాఫిక్ పోలీసులు గానీ కన్నెత్తి చూడకపోవడంతో పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి సబ్ రోడ్ లో ఈ మధ్యకాలంలో ఫుట్ పాత్ లపైన అక్రమార్కులు కన్ను పడడంతో ఫుట్పాత్లు ను దర్జాగా కబ్జా చేసి... పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా షాపులను ఏర్పాటు చేసి వ్యాపారులు కొనసాగిస్తున్నారు. దీంతో తరచూ పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్లో ఫుట్పాతులు పై పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా షాపులు ఉండడంతో పాదచారులు ప్రమాదానికి గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు, పాటు ట్రాఫిక్ సిబ్బంది నిర్లక్ష్యం వైఖరి కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొంటుందని, ఇలా అయితే ఫుట్ పాతులపై నడిచేది ఎలా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్ పాత్లును ఆక్రమించి వ్యాపారులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా శివపార్వతుల కళ్యాణం



ఆరిలోవ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

స్థానిక 12వ వార్డు పెదగదిలి గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం 24వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం ఆలయంలో శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి శ్రీనివాస్ దంపతులు హాజరయ్యారు. మేయర్ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి సాల్వతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహా అన్నదానానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కోల బంగారయ్య, సభ్యులు చల్లా రాజు ధూళి రఘు, పెసల శ్రీను, ఒమ్మి వెంకటి, పాల్తేరు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య కీర్తనలను అద్భుతంగా ఆలపించిన శ్రీహరి కీర్తనల బృందం



పద్మనాభం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :

పద్మనాభం గ్రామంలో అనంత పద్మనాభస్వామి గిరి గిగువన వేంచేసియున్న కుంతీమాధవస్వామి ఆలయంలో ఆదివారం విజయనగరం శ్రీహరి కీర్తనల బృందం సభ్యులు అన్నమయ్య కీర్తనలను అద్భుతంగా ఆలపించారు. నాయకుల సహకారంతో ఈ కార్యక్రమంను నిర్వహించారు. అయితే సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి పది గంటల వరకు ప్రతి కీర్తనలో శ్రీనివాసుడుని, పద్మావతి, అలివేలు మంగమ్మ అమ్మవార్లను అన్నమయ్య వర్ణించే విధానంను మధురమైన సంగీతంతో ఆలపించారు. ఈ కీర్తనలు ప్రతి ఒక్కరిని ఆధ్యాత్మిక తత్వంలో ముంచెత్తాయి. ఈ ఆలయంలో ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, ఎంపీటీసీ లక్ష్మీనాయుడు, ఎర్రినాయుడు, పైడిరాజు, పద్దు పాల్గొన్నారు.

## మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



గోపాలపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాత వార్త:

పోలీస్ కేసు నమోదు కావడంతో మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోపాలపట్నం ఇందిరానగర్ లో ఆదివారం చోటుచేసుకుంది. దీనిపై పోలీసులు మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలలో ఉన్నాయి. స్థానిక ఇందిరానగర్ కు చెందిన ఆటో డ్రైవర్ సోమేశ్ కు చెందిన మనీ పర్సు గత ఏడాది సంక్రాంతి సమయంలో చోరీకి గురైంది. అదే సమయంలో స్థానికంగా నివాసం నాగరాజు ఆప్టింగ్ డ్రైవర్ గా పనిచేస్తుండేవాడు. అయితే ఈ విషయం అంతగా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల నాగరాజు స్నేహితుడు ఆనంద్ ఇల్లు మారుతుండగా సదరు మనీ పర్సు దొరకడంతో సోమేష్ కు అప్పగించేందుకు ప్రయత్నించాడు. అయితే సదరు మనీ పర్సులో ఉన్న 25వేల రూపాయల నగదును అప్పగించాల్సిందిగా సోమేశ్ పట్టుబడి దీని నిమిత్తం గోపాలపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు నాగరాజును ఆనందును కేసులు పిలిపించి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో మనస్థాపన చెందిన ఆనంద్ ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా సోమేష్ తప్పుడు ఫిర్యాదు చేశాడని, ఏడాది క్రితం జరిగిన సంఘటన సాకుగా తీసుకొని ఇప్పుడు ఫిర్యాదు చేయడం సరి కాదని మృతుని బంధువులు, స్నేహితులు ఆరోపిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ కు తరలించి విచారం చేపడుతున్నారు.

# భక్తులతో కిటకిటలాడిన సూర్యనారాయణ స్వామి ఆలయం



**అనకాపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాత వార్త**

సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి, శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసం ఆఖరి ఆదివారం కావడంతో విశేషంగా భక్తులు దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సూరిశెట్టి తారక రామారావు దీప్తి దంపతులు, రింగ్ రోడ్ క్వాలిటీ స్వీట్ షాప్ యజమాని శ్రీను దంపతుల సహకారంతో తీపి బూందిని ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి చేతుల మీదుగా ప్రసాదం వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు పెంటకోట చందర్రావు, దొడ్డి భరత్, సూరిశెట్టి బల్లమ్మ, మారిశెట్టి భాస్కరరావు, శ్రీకాకుళం గణపతి, తురకలపూడి హేమ ఈశ్వర్ తెలుగుదేశం పార్టీ నాయకులు దూలం ప్రసాద్, రీసు అప్పలాచారి తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం బస్సు యాత్ర




**కసింకోట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

కసింకోట మండలంలోని పరవాడ పాలెం గ్రామం నుంచి శనివారం రాత్రి భద్రాచలం బస్సు యాత్రకు సుమారు 70 మంది భక్తులు బస్సులో బయలుదేరారు. గ్రామ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, సీతారాముల వారి ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు గొంతిని శివ బాబు సొంత ఖర్చుతో, పరవాడపాలెం గ్రామంలో సీతారాముల వారి ఆలయం ప్రారంభం జరిగిన తర్వాత ప్రతి సంవత్సరం గ్రామం నుంచి భక్తులను ఏదో ఒక యాత్రకుతీసుకెళ్లాలని నిర్ణయించుకున్నానని, మొదటి సంవత్సరం తిరుపతి బస్సులో గ్రామంలో ఉన్న భక్తులను మొదటి సంవత్సరం తీసుకెళ్లడం జరిగింది అని, అన్నారు. ఈ సంవత్సరం కూడా ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా, గ్రామం నుంచి సుమారు 70 మంది భక్తులను శనివారం సాయంత్రం భద్రాచలం యాత్రకు బస్సులో తీసుకువెళ్లడం జరిగిందని ఈ యాత్ర మూడు రోజులపాటు ఉంటుందని, ఈ యాత్రకు వచ్చిన భక్తులందరికీ తన సొంత ఖర్చులతో యాత్రలు చూపించి తిరిగి గ్రామానికి తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటున్నానని అన్నారు. అలాగే ప్రతి సంవత్సరం సీతారాములు వార్షికోత్సవాలు కు, గ్రామం నుంచి భక్తులను యాత్రలకు బస్సులో తీసుకెళ్లడం జరుగుతది అని తెలిపారు. అలాగే సీతారాముల వారి ఆశీస్సులు శ్రీ భద్రాద్రి రాముని యొక్క ఆశీర్వదములు గ్రామ ప్రజలకు, ఉండాలని అని అన్నారు.

# నేడు భావనా రుషి శూలాల సంబర మహోత్సవం

### ఘనంగా ఏర్పాట్లు - విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న పలివెల వీధి



**తరలివస్తున్న భక్తులు (నక్కపల్లి, ప్రభాతవార్త)**




పద్మశాలీల కుల దైవం శ్రీ భక్త మార్కెండేయ భావనా రుషి స్వామి, శూలాల సంబర మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించేందుకు మార్కెండేయ సేవాసంఘం పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని పలివెల వీధిలో ఉన్న భావనా ఋుషి ఆలయాన్ని ఈ సందర్భంగా విద్యుద్దీపాలం కరణలతో అందంగా తీర్చిదిద్దారు. ఈ శూలాల సంబరం సందర్భంగా ప్రభ మహోత్స కార్యక్రమం కీలకంగా నిర్వహిస్తారు. అంగరంగ వైభవంగా శ్రీ భావానా రుషి స్వామి పత్రి తేవడం. జరుగుతుంది. ప్రతీ మాఘమాసం సందర్భంగా భవానా ఋుషి శూలాల సంబరం ప్రతిష్టాత్మకంగా పద్మశాలీలు నిర్వహిస్తారు. అదే విధంగా ఈ ఏడాది భారీఎత్తున నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి భజన కార్యక్రమం ప్రారంభమవుతాయి. ఈ శూలాల సంబర మహోత్సవం జరుగుతుంది. పత్రి కార్యక్రమం అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధనతో పాటు పలు సంస్కృతిక కార్యక్రమలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పెద్దఎత్తున ఉమ్మడి జిల్లాలతో పాటు కోస్తా జిల్లాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా చేరుకొన్నారు. వలివెల వీధి అద్దాల వీధి ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ శూలాల సంబర మహోత్స వంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నడూ చూడని విధంగా ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయకమిటీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. ఈ సంబరంలో పాల్గొనేందుకు ఉత్తర కోస్తా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి పద్మశాలీ కులసంఘ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు రానున్నారు. మాఘమాసం చివరి సోమవారం కావడంతో నక్కపల్లి తో పాటు మండలంలోని గుడిచర్ల గ్రామంలో కూడా శూలాల సంబర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాటు చేశారు.

# అల్లూరి ఉద్యమ స్ఫూర్తి నేటి యువతకి జీవిత పాఠం కావాలి...

### అల్లూరి శత వర్ధంతి జాతలో వక్తలు



**గొలుగొండ ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఉద్యమ స్ఫూర్తి నేటి యువతరానికి జీవితపాఠంగా నిలవాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం విశాఖపట్నం నుంచి కృష్ణాదేవి పేట అల్లూరు పార్కుకు చేరుకున్న అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి జీపు జాత కార్యక్రమం పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ అల్లూరికి ఆశ్రయం ఇచ్చిన చిటికెల భాస్కర్ నాయుడు వారసుడు చిటికెల భాస్కర్ నాయుడును సత్కరించారు. అల్లూరు పార్కులో ఉన్న అల్లూరి గంటం సమాధులను సందర్శించి పుష్పగుచ్చాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరి వర్ధంతి శత ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తూ వస్తున్నామని ఈ క్రమంలోనే విశాఖపట్నంలో బయలుదేరి నేడు అల్లూరు పార్కుకి చేరుకున్నామని సభ అధ్యక్షులు సిహెచ్ ప్రమీల అన్నారు. వక్తలు వాడపల్లి. వెంకట రవణమ్మ మాట్లాడుతూ స్వతంత్ర సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు పోరాటాన్ని వివరించారు. బ్రిటిష్ వారి బానిస సంకెళ్ల నుండి గిరిజనులకు విముక్తి కలిగేలా పోరాటం చేశారని అన్నారు. ఎస్.గోవిందరాజులు , కార్యదర్శి అల్లూరి శతవర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మన్యం ప్రజల్లో తీసుకొచ్చిన చైతన్యం నేటి సమాజంలో యువతకు ఎంతో అవసరం అన్నారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా గత సంవత్సరం నుండి అనేక జిల్లాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, వకృత పోటీలు, సమావేశాలు నిరహించి చివరగా ఫిబ్రవరి 22,23 విశాఖపట్నం నుండి కృష్ణాదేవిపేట వరకు బస్సు జాత నిర్వహించాము అన్నారు. స్వాతంత్రం ముందు దోపిడీ ఉంది. నేడు కూడా దోపిడీ మరోరకంగా ఉంది కావున అటువంటి దోపిడీ రహిత సమాజం కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపును ఇచ్చారు. పౌర చైతన్య హక్కుల కార్యదర్శి ప్రొఫెసర్. కోలవెన్ను చంద్ మాట్లాడుతూ ఇంత వరకు మనం అనేక పాఠశాలలు, కళాశాలలో అల్లూరి జీవిత చరిత్ర తెలుసుకొని పని చేశామని అన్నారు. ఇప్పుడు మనం ఐక్యంగా జ్ఞానాన్ని, గొప్ప సంస్కృతిని సాధిస్తూ ముందుకు వెళ్లాలి అని పిలుపునిచ్చారు. డి.రాఘవేంద్ర, మాట్లాడుతూ అల్లూరి 27 సంవత్సరాలకు పిన్నవయసులోనే మరణించారని అన్నారు. ఈ మరణాన్ని రెండు విధాలుగా చూడాలని ముఖ్యంగా రెండు విషయాలు ఒకటి వారికి సామాన్య ప్రజల పట్ల ఉన్న ప్రేమ వల్ల వారి కష్టాలకు కారణం దోపిడీ అని గుర్తించి దానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. రెండవది ఏ రకంగా పోరాటం చేయాలని మార్గాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. డాక్టర్ ఆర్.గంగాధర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్టాండ్లీ ఇంజనీరింగ్ కాలేజీ, అల్లూరి పోరాటం మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్ర పోరాటాన్ని ఒకతలమానికం అన్నారు. హరీష్ కుమార్ రెడ్డి (ఆల్ ఇండియా డెమోక్రాటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్)ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ విద్యా రంగంలో వస్తున్న అనేక సమస్యలకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి అన్నారు. మహేష్ (ఆల్ ఇండియా డెమోక్రాటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి. మాట్లాడుతూ విద్యార్థులు అనేక చెడు ధోరణులకు అలవాటు పడుతున్నారని అన్నారు. ఇటువంటి తరుణంలో ఇలాంటి పోరాట యోధుల స్ఫూర్తి మీరు, మనం చెడుకు, దోపిడీకి వ్యతిరేకంగా ముందుకు రావాలి అన్నారు. ఇతర జిల్లాల అల్లూరి కమిటీ సభ్యులు నెల్లూరు జిల్లా నాయకులు బసవరాజు సురేష్, త్రినాధ్, గుంటూరు మరియు విజయవాడ నాయకులు శివప్రసాద్, అనంతపూర్ నాయకులు సురేష్, కర్నూలు నాయకులు మల్లేష్. తిరుపతి నాయకులు నవీన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల నుండి వందల సంఖ్యలో విద్యార్థులు హాజరైనారు.

# పారిశుద్ధ్య నిర్మూలనకు సహకరించండి

### పల్లెలను పచ్చగా ఉంచండి :జిల్లా పంచాయతీ అధికారి" శిరీష రాణి"





**(నక్కపల్లి, ప్రభాతవార్త)**

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేస్తే సంపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరం పొందగలుగుతామని జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి సూచించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో రెండు రోజులపాటు మండలంలో 33 గ్రామపంచాయతీ నందు చెత్త నుండి సంపద తయారీ కార్యక్రమంలో భాగంగా పొడి చెత్త తడి చెత్త ను ప్రతి ఇంటి నుండి సేకరణ చేయుటకు ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఆదివారం స్వయంగా ఆమె పరిశీలించారు. నక్కపల్లి పట్టణంలోని ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలి ఆ వేరు చేసిన చెత్తను తీసుకెళ్లే పంచాయతీ సిబ్బందికి ఏ విధంగా అందజేయాలి అనేదానిపై పూర్తిస్థాయిలో ఆమె తెలియజేశారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఎక్కడబడితే అక్కడ చెప్పను వేయకుండా ఆ చెత్తను చెత్త సంపద కేంద్రానికి వెళ్లే విధంగా తడి పొడి చెత్తను వేరు చేస్తే ఎంతో ఉపయోగ ఉంటుందని ఆ విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎక్కడబడితే అక్కడ చెత్త వెయ్యవద్దని కోరారు. ఆమెతోపాటు డివిజనల్ పంచాయతీ అధికారి మూర్తి, ఇన్చార్జి ఈవో పి ఆర్ డి మజ్జి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి.ఎస్.పి మూర్తి, అన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

# గ్రంథాలయంలో చదవడం మాకిష్టం



**గొలుగొండ ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



గోల్కొండ శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి రాజబాబు నిర్వహించారు. స్థానిక విద్యార్థులను గ్రంథాలయానికి తీసుకువచ్చి చదవడంపై ముక్కు పెంచుకోవాలని చరిత్రను తెలుసుకోవాలని విద్యార్థులతో అన్నారు. విద్యాశాఖ సిబ్బంది రామకృష్ణ పాల్గొని ప్రస్తుతం విద్యార్థులకు ఏవి అవసరమో అందుకు తగిన పాఠ్యపుస్తకాలు ఎలా సేకరించాలో తెలియజేశారు. ఆదివారం కదా అని చదువును పక్కన పెట్టకూడదని విద్యార్థులతో అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# నూక తాత పండగకు ఆహ్వానం.!



**(నక్కపల్లి, ప్రభాతవార్త)**

మండలంలోని రాజయ్యపేటలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే మత్స్యకారుల కులదైవమైన నూకతాత పండగకు రాష్ట్ర హోం మంత్రివర్యులు వంగలపూడి అనిత ని కలిసి ఆ గ్రామస్తులు ఆహ్వానించారు. నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో కలిసిన ఉత్సవ కమిటీ నాయకులు పండగకు రావాలని కోరారు. వారితోపాటు మంత్రిని కలిసిన వారిలో ఉప్మాక వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి) గ్రామ పూజారి పిక్కి దేముడు, మదదా రాంబాబు, పిక్కి పెద్దియ్య, పిక్కి చిన్నారి, పిక్కి గోపి తదితరులు ఉన్నారు.

# కళ్యాణపులోవ, దారమట్టంకు ప్రత్యేక బస్సులు

**నర్సీపట్నం,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:**



మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 25 మంగళవారం సాయంత్రం నుండి 27 గురువారం సాయంత్రం వరకు కళ్యాణపులోవ, దారమట్టం పుణ్యక్షేత్రాలకు 50 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు నర్సీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంఎస్- ఎస్. ధీరజ్ తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు నర్సీపట్నం - కళ్యాణపులోవ, కొత్తకోట కళ్యాణపులోవ, దొండపూడి-కళ్యాణపులోవ, రావికమతం-కళ్యాణపులోవ, కొంతలం-కళ్యాణపులోవ, కశిరెడ్డిపాలెం-కళ్యాణపులోవ, అదే విధంగా నర్సీపట్నం దారమట్టం గొలుగొండ-దారమట్టం, కృష్ణదేవిపేట-ధారమట్టం, కంటారం-ధారమట్టం మొదలగు ప్రాంతాలకు ఈ ప్రత్యేక బస్సులు నడపబడునన్నారు. ఈ ప్రత్యేక బస్సులు ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా సాధారణ చార్జీలతో మాత్రమే నడపబడునని తెలియజేసారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఎలమంచిలి,ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :**

33/11 కెవి యలమంచిలి సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి ఎలమంచిలి టౌన్ 4వ ఫీడర్ సంబంధించి టౌన్ కి కొత్త ఫీడర్ కొరకు లైన్ నిర్వహణ పనులు (ఆర్.డి.ఎస్.ఎస్) నిమిత్తం సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలో మిలిటరీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, స్టేషన్ రోడ్, మెయిన్ రోడ్, ద్వారకా నగర్, నెహ్రూ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ఇంటింటా చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరగాలి..

### జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి శిరీష రాణి



**కశింకోట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

ఇంటింటా చెత్త సేకరణ పూర్తి స్థాయిలో గ్రామాలలో జరగాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీష రాణి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కసింకోట గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి స్వయంగా పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీలో శని,ఆదివారాలు అన్ని గ్రామ పంచాయతీలలో ఇంటింటా చెత్త సేకరణ పూర్తి చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తుందన్నారు.కసింకోట పంచాయతీలో చెత్త సేకరణ బాగుండడంతో ఈఓ పీఆర్డి వెంకట లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు లను ఆమె అభినందించారు.తడి చెత్త, పొడిచెత్త వేరువేరుగా సేకరణ చేస్తున్నారని చెప్పారు. సేకరణ చేసిన పొడి చెత్తలో ప్లాస్టిక్, గాజు పరికరాలు వంటి వివిధ పరికరాలను మరల చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాల్లో వేరుచేసి ఆయా రంగాల్లో సేకరణ చేస్తున్న వారికి విక్రయిచడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాల్లో తడి చెత్త నుండి సేంద్రియ ఎరువులను తయారు చేసే ప్రక్రియకు పెద్ద ఎత్తున నిర్వహించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు.ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించి పరిశుద్ధ జిల్లాను ఏర్పాటు చేయడంలో తోడ్పాటు అందించాలని కోరారు. పంచాయతీరాజ్ సంచాలకులు ఈ విషయం పట్ల ప్రత్యేక చొరవ తీసుకొని పనిచేస్తున్నారని అమే చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డి ఎల్ పి ఓ ఎస్.ఎస్.ఎన్.మూర్తి, సచివాలయం కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ముందుగా గుర్తించడంతో బాల్య క్యాన్సర్ నివారణ

**-మేనేజింగ్ డైరెక్టర్ డా. మురళీ కృష్ణ**

**జగదాంబ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**



ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న జరుపుకునే అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవం సంధర్భంగా చిన్నారుల్లో క్యాన్సర్పై అవగాహన పెంచడమే లక్ష్యాంగా మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ %డ% రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, శ్రేయా క్యాన్సర్ ఫౌండేషన్ కలిసి "ఇన్స్పైరింగ్ యాక్షన్ 2025" కార్యక్రమాన్ని నగరంలోని , అక్కయ్యపాలెం విశ్వనాధ్ స్పోర్ట్స్ క్లబ్ వద్ద విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ %డ% రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ డా. మురళీ కృష్ణ మాట్లాడుతూ, చిన్నతనంలో క్యాన్సర్ను తొందరగా గుర్తించడం, సమానమైన వైద్యం అందించడంతో పాటు, బతికి బయటపడిన పిల్లలకు దీర్ఘకాల మద్దతు అవసరమన్నారు. ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డా. వై. రజనీ ప్రియా,డా. బాలా స్టాలిన్ చౌదరి, డా. ప్రవీణ పూన్నా,డా. జే. శివ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ను త్వరగా గుర్తించి చికిత్స ప్రారంభించడం వల్ల మరణాలను తగ్గించవచ్చని తెలిపారు.

# ఆంధ్రా బ్యాంకు పెన్షన్ అప్డేషన్ ఇన్సూరెన్సు ప్రీమియంపై చర్చ



**జగదాంబ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**

ఆంధ్ర బ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖపట్నం రీజియన్ ఆధ్వర్యంలో ద్వారాకా నగర్ పౌర గ్రంధాలయంలో ఆదివారం రిటైర్డ్ ఎంప్లాయిస్ పెన్షన్ అప్డేషన్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా బ్యాంకు ఫౌండర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి అతిధులు చేతుల మీదుగా పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో పెన్షన్ అప్డేషన్, ఇన్సూరెన్సు ప్రీమియంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వారణాసి కృష్ణ మూర్తి, ప్రెసిడెంట్. జి ఎస్.వి కృష్ణా రావు అడ్వైజర్. సత్య ప్రసాద్ అడ్వైజర్. వి వాసు దేవ మూర్తి. డి జి ఎస్. టంకాల.కామేశ్వరరావు ఏ జి ఎస్. మూల భాస్కర్. సి సీ మ్ ప్రీమిముమ్ మేనేజ్మెంట్పై సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి ముర్చుమ్ జయరావు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమం

పాడేరు,ఫిబ్రవరి23, ప్రభాతవార్త:



పాడేరు శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ ఉమానీలకంటేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, కమిటీ సభ్యులు యువతి క్లాత్ షాపు యజమాని బొజ్జ త్రినాథ్ చేతుల మీదగా అన్న ప్రసాద కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు మరియు ఆలయ కమిటీ సభ్యులు సల్ల రామకృష్ణ దన్నేటి పలాసి రాము బోనంగి వెంకటరమణ లాకే రత్న బాయి కిల్లు రాధాకృష్ణన్ నాయుడు దంపతులు ఏబీఎన్ హరి బాబు కిల్లు చంద్రమోహన్, పలాసి రమణమ్మ, కారం దేముడు ,కూర రాము, కూర నాగమణి ఆలయ కమిటీ గుమస్తాలు గూడెపు సూర్య ప్రకాష్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## అధైర్య పడొద్దు.. జాగ్రత్తలు తీసుకోండి..

### సరియాపుట్టు గిరిజనులకు సూచించిన జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ....

ముంచంగి పుట్టు, ఫిబ్రవరి 23 , ప్రభాతవార్త:::





అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో కించాయి పుట్టు పంచాయితీ సరియాపుట్టు గ్రామంలో అనారోగ్య సమస్యల వలన కొందరు గిరిజనులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో విషయం తెలుసుకున్న జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర హుటా హుటిన ఆయా గ్రామాలను సందర్శించి అనారోగ్యానికి గల కారణాలను గ్రామస్తులను అడిగి అనంతరం గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో అనారోగ్యాలపై ప్రతి ఒక్కరూ ఆందోళన చెందుతున్నారని ఇందులో భయపడాల్సిన పనిలేదని జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర సూచించారు. ముంచంగిపుట్టు మండలం కించాయిపుట్టు పంచాయతీ సరియాపుట్టు గ్రామంలో సుభద్ర ఆదివారం పర్యటించారు. గ్రామంలో పలుచోట్ల అపరిశుభ్ర పరిస్థితులు ఉండడం... తాగునీటి సమస్యను ఎదుర్కోవడాన్ని ఆమె గుర్తించారు. గతంలో కూడా తమ గ్రామానికి తాగునీటి సమస్య ఉందని, వాగులలో నీళ్లు తాగడం వల్ల తాము వ్యాధులు బారిన పడుతున్నామనే విషయాన్ని చైర్పర్సన్ గారి దృష్టికి స్థానికులు తీసుకొచ్చిన నేపథ్యంలో ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. గెడ్డలు, వాగుల నుంచి నీరు తీసుకువచ్చిన సరే కాచి చల్లార్చిన తర్వాత మాత్రమే తాగాలని ఆమె సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కలెక్టర్ తో స్వయంగా చర్చించి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని చెప్పారు. కొందరు గిరిజనులు అస్వస్థతకు గురయ్యారన్న ఆందోళనతో మిగిలిన వారు కూడా భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదని చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే అనారోగ్య సమస్యలు మన దరికి చేరవని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏవైనా కాచి చల్లార్చిన నీటిని గాని పాలు గాని తీసుకోవాలని, కూరగాయలు, మాంసం వంటివి ఎక్కువసేపు ఉడకబెట్టినవి మాత్రమే తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్ , వైఎస్ఆర్సిపి నాయకుడు సన్యాసిరావు, తిరుపతిరావు, రొబ్బా రాజారావు, రిటైర్డ్ టీచర్ ప్రసాద్ రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి సిద్ధమవుతున్న శైవక్షేత్రాలు



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 22, ప్రభాత వార్త

మహాశివరాత్రి సందర్భంగా మండలంలో గల అన్ని శివాల యాలను ఆలయ కమిటీలు సిద్ధం చేస్తున్నారు. జడ్డంగి శ్రీశ్రీశ్రీ భ్రమరాంభికా మల్లిఖార్జున స్వామి ఆలయం వద్ద జల్లుగట్టం, జలపాతాలు కు వెళ్లేందుకు ముఖద్వారం, ఆలయం చుట్టు విశాలంగా బారీ స్థాయిలో భక్తులు దర్శించుకోవడానికి వీలుగా ప్రత్యేకంగా గోడనుకట్టి ఏర్పాటు చేయడంలో కమిటీ, యువకులు కృషి చేశారు. 26 తేదీన దర్శనం, మధ్యాహ్నం శ్రీపూరి రంగారావు వారిచే అన్నదానం, సాయంత్రం జడ్డంగి గ్రామ వీదులు గుండా ఊరేగింపు, రెండో రోజు బదిరెడ్డి మునియ్యాదొర ఆధ్వరంలో అన్నదానం, మూడోరోజు అన్నదానం, నాలుగోరోజు కొమరాపురం గ్రామానికి చెందిన ఆద్య రమేష్ వారిచే అన్నదానం జరుగుతుందని ఆలయ కమిటీ వెల్లడించారు. జడ్డంగి ప్రధాన రహదారి, శివాలయ ముఖద్వారం నుండి విద్యుత్ దీపాలు వెలుగులు, స్నాన ఘట్టాలు వద్ద మరుగుదొడ్లు ఏర్పాట్లును ఆలయ కమిటీ చేశారు. నాలుగు రోజులు పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలయం వద్ద ప్రత్యేక వైద్య శిభిరాలను నిర్వహిస్తున్నారు. త్రాగునీటి సౌకర్యం కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. 60 సం. పురాణ చరిత్ర గల వంచంగి కుంతీ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద మూడు రోజులు పాటు మహాశివరాత్రి ఉత్సవాలను చేయడానికి ఆలయకమిటీ ఏర్పాట్లు చేశారు. కుంతీ దేవి ఈ వాగులో స్నానం, ప్రక్కనే ఉన్న రాయిపై జపములు చేసినట్లు పురాణ చరిత్రను పూర్వీకులు తెలిపారు.రాజవొమ్మంగి రాజరాజేశ్వరి సమెత రామలింగేశ్వర స్వామి ఆలయం రంగులతో సిద్దమైంది. ఆలయానికి రంగులు వేయడానికి భక్తులు వాడ్రెవు సుందరావు సహకారం అందించారని సర్పంచ్ గొల్లపూడి రమణి, గొల్లపూడి పెద్దిరాజు, తుపాటి వీర్రాజు, ఆలయ కమిటీ తెలిపారు. ఆలయం కొండ ప్రాంతం కావడంతో వాహనాలు వెళ్ళడానికి వీలుగా రహదారి ఏర్పాటు చేస్తున్నామని కమిటీ ముప్పన మోహన్, కేశవ్, నక్కా రాజు, పెది రెడ్ల సత్తిబాబు, వరదా సత్తిబాబు, జెట్టి మధు, కమిటీ సభ్యులు తెలిపారు. వాతంగి, బట్టావారివీధి గోబ్బిలమడుగు, లబ్బర్తి, అమ్మిరేకుల, కింద్ర కొలనీ, కిర్రాబు గ్రామాల్లో గల శివాలయాల వద్ద కూడా మహాశివరాత్రి వేడుకలు జరుగనున్నాయి.

## ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల..

### జివో నంబర్ 3 చట్టబద్ధతపై ప్రస్తావించాలి:

### పాడేరు ఎమ్మెల్యే కు ఆదివాసి గిరిజన సంఘం విజ్ఞప్తి:

పాడేరు,ఫిబ్రవరి23, ప్రభాతవార్త:



రానున్న అసెంబ్లీ సమావేశంలో షెడ్యూల్ ఏరియాలో వందశాతం ఉద్యోగ ,ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వంపై ఒత్తిడి చెయ్యాలని పాడేరు నియోజకవర్గం ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు కి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి దాసు మండల కార్యదర్శి ఎస్. చిట్టిబాబు ఆధ్వర్యంలో పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ మాట్లాడుతూ ఈనెల 24 నుండి జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో షెడ్యూల్ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగ ,ఉపాధ్యాయ నియామక చట్టం ప్రభుత్వం బడ్జెట్ సమావేశంలో ఆమోదించి ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.జివో నంబర్ 3 చట్టబద్ధత ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీపై రాష్ట్ర ముఖ్యమంత్రి అరకు ఎన్నికల సభలో ఇచ్చిన హామీప్రకారం రానున్న అసెంబ్లీ సమావేశంలో ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం ఉద్యోగ, నియామక చట్టం చెయ్యాలని డిమాండ్ చేశారులి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచిన గిరిజన సలహా మండలి నియమించలేదని తక్షణమే గిరిజన సలహా మండలి ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు 1/70 చట్టం అమలుపై రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సమావేశంలో చర్చించాలని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకచట్టం, ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల పై ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలో ప్రభుత్వంపై ఒత్తిడి చెయ్యాలని విజ్ఞప్తి చేశారు 1/70 చట్టం అమలుపై రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సమావేశంలో చర్చించేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలోని ఎమ్మెల్యే లందరూ ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటి తరపున విజ్ఞప్తి చేస్తున్నాం ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎస్ చిట్టిబాబు మండల నాయకులు బోజ్జన్న సింహాద్రి ఆనంద్ పాల్గొన్నారు.

## పారా లీగల్ వాలంటీర్లకు ఆహ్వానం

చింతపల్లి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త.

పారా లీగల్ వాలంటీర్ గా పనిచేసేందుకు ఆసక్తి గల యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్థానిక న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎం.రోహిత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు న్యాయపరమైన సలహాలు న్యాయ సహాయం అందించేందుకు ఆసక్తిని చూపే ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పదవ తరగతి కనీస విద్యార్హతగా ఉత్తీర్ణులై ఉండాలని సేవా సంస్థల్లో పనిచేసిన వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా చింతపల్లి న్యాయస్థానంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయానికి దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు విద్యార్హత నకలతో పాటు పాస్పోర్ట్ సైజు ఫోటోను అందజేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జీతం గౌరవ వేతనం ఉండదని తెలిపారు.

## తెగిపడిన విద్యుత్తు తీగలు.. దగ్ధమైన తోటలు



డుంబ్రిగుడ, రూరల్, ఫిబ్రవరి 23ప్రభాతవార్త

:మండలంలోని సొవ్వా పంచాయతీ కమలబంద గ్రామ సమీపంలో శనివారం రాత్రి విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. అకేసియా తోటలు దగ్ధమవ్వడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. రాత్రిపూట జరగడంతో పశువుల కాపారులు, పశువులకు ప్రమాదం తప్పిందని గిరిజనులు అంటున్నారు. తెగిపడిన తీగలతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఆ గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు గురునాయుడు సంబంధిత విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది చేరుకుని స్థానికుల సాయంతో తీగలను సరి చేసి విద్యుత్తును పునరుద్ధరించారు.

## ప్రమాదానికి గురైన రూడకోట తెలుగు టీచర్ కొర్ర రాజును

### పరామర్శించిన టిడిపి డివిజన్ నాయకులు పాంగి పాండురంగస్వామి

పాడేరు,ఫిబ్రవరి23, ప్రభాతవార్త:



అల్లూరి జిల్లా పెదబయలు మండలం రూడకోట పాఠశాలలో తెలుగు టీచర్ గా పని చేస్తున్న కిల్లో రాజు విధులు నిర్వహించి ఇంటికి వెళ్తుండగా పెదబయలు సీతగుంట పంచాయితీ చిట్రాయిపుట్ లో రోడ్డు మలుపు దగ్గర బైక్ తో ప్రమాదపు శాస్తు బోల్తా పడడంతో తీవ్ర గాయాలు పాలయ్యారు. దీంతో గాయాలు పాలైన ఉపాధ్యాయుడు పాడేరు లో గల జిల్లా ఆసుపత్రి లో వైద్యం నిమిత్తం వచ్చారని తెలుసుకొని టిడిపి డివిజన్ నాయకులు పాంగి పాండురంగస్వామి అయన దగ్గర వెళ్లి పరామర్శించారు. వైద్యులకు మెరుగైన వైద్యం అందించాలని కోరి మాస్టర్ కి దైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

## 14వ శతాబ్దం నాటి రంప విశిష్టత

### రంపలో ప్రత్యేక ఆకర్షణగా అరుదైన రుద్రాక్ష, మొగలిపువ్వుల చెట్లు







రంపచోడవరం. ఫిబ్రవరి 23 ప్రభాతవార్త.

పరమేశ్వరుడు భ్రమరాంబ మల్లికార్జున రూపంలో కొలువైన రంప శివాలయానికి అనేక విశిష్టతలు ఉన్నాయి. భక్తుల కొంగుబంగారంగా పూజలు అందుకుంటున్న మల్లికార్జునుని ఆలయం 14వ శతాబ్దంలో నాగ వంశ రాజులు నిర్మించారని చరిత్ర చెబుతోంది. కొండ దిగువన రాతి కట్టడంతో నిర్మించిన శివాలయం అలనాటి దేవాలయాల నిర్మాణ ప్రతిభను కళ్ళకు కడుతుంది. కొండపైన జలపాతం పక్కనే గుహలో మరొక మల్లికార్జున విగ్రహం ఉంది. అక్కడే రాతి పై చెక్కిన నాగ ప్రతిమలు సైతం పూజలు అందుకుంటున్నాయి. ప్రతి ఏటా వేలాది మంది భక్తులు శివరాత్రి నాడు రంప శివుని దర్శించి మల్లికార్జునునీ పై తమ భక్తిని చాటుకుంటున్నారు. ఏడాది పొడవునా ఏజెన్సీ పర్యటనకు వచ్చే పర్యాటకులు ఇక్కడి రంప శివాలయాన్ని సందర్శిస్తారు. ఎక్కడా లేనివిధంగా రంప శివాలయం పక్కనే రుద్రాక్ష చెట్టు ఉంది. అలాగే 14వ శతాబ్దంలో నాటిన మొగలి చెట్లు వనంగా పెరిగి ఇప్పటికీ రంపలో కనువిందు చేస్తున్నాయి. శివుని పూజలో మొగలిపూలు వాడుతారు. రాజులు ఇక్కడ శివుని పూజించేందుకు మొగలిపూల చెట్లు నాటారని చెప్తున్నారు. రంప శివాలయం అర్చకులు ప్రసన్న కొన్నాళ్ల క్రితం నాటిన రుద్రాక్ష గత నాలుగేళ్లగా కాయలు కాస్తుంది. శివరాత్రి రోజు ఇక్కడ ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రాక్షలు తీసుకు వెళుతున్నారు. సర్వ పాపాలు హరించి కోరిన కోర్కెలు తీర్చే రంప మల్లికార్జున దర్శనం మనసుకు శాంతిని కంటికి అక్కడి ప్రకృతి ఆహ్లాదాన్ని అందిస్తోంది.

## అరకులోయలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాడేరు,ఫిబ్రవరి23,ప్రభాతవార్త:

ఈ నెల 24 వ తేదీ సోమవారం 11 కేవి అరకు (అంజోడ) టౌన్ ఫీడర్ కొత్త విద్యుత్ స్తంభాలు వేయుట కొరకు విద్యుత్ సరఫరాను ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం మూడు గంటలవరకు నిలిపి వేయుట జరుగుతుందనీ విద్యుత్ శాఖ పాడేరు ఈ ఈ ఏ వి ఎన్ ఏం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. కావునా అరకు వేలీ, పాంద్రంగిని, ఎండపల్లివలస , రవ్వలగూడ,సరభగుడ పద్మాపురం, అరకు (సంత బయలు) విద్యుత్ సరఫరా నిపివేయడం జరుగుతుందనీ కావునా విద్యుత్ వినియోగ దారులు అందరూ సహకరించ వలసినది గా ఈ ఈ అప్పారావు కోరారు.

## చింతూరులో ఘనంగా కనక దుర్గ అమ్మవారి 26వ వార్షికోత్సవం

### తండోప -తండాలుగా తరలివచ్చిన భక్తులు.

చింతూరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త





చింతూరు శబరి ఒడ్డున కొలువై ఉన్న శ్రీ కనక దుర్గ అమ్మవారి 26వ వార్షికోత్సవాన్ని ఆదివారం చింతూరులో ఘనంగా నిర్వహించారు. వేకువ జామున మహిళలు, యువతులు పుణ్య స్నానాలు అ చరించి శబరి నదిలో నుండి వేలా ది బిందేలతో జలాలను తెచ్చి దేవత విగ్రహాలకు జాలభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పూజారులు తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి, ధూప దీప,నైవేద్య కార్యక్రమాలను పూర్తి చేశారు. వందలాది భక్తులు పూజారుల చేత అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. తమ కోరికలు నెరవేరుతాయన్న విశ్వాసంతో భక్తులు ఉత్సాహంగా జలాభిషేకంలో పాల్గొన్నారు. దుర్గామాత ఆలయం గ్రహదోషాలు తొలగించే పవిత్రస్థలంగా భక్తుల నమ్మకాన్ని సొంతం చేసుకుంది. ఇక్కడ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు వద్ద నవగ్రహ పూజ చేయడం ద్వారా దోష పరిహారం పొందవచ్చని ప్రజలు విశ్వసిస్తారు. అదేవిధంగా, అమ్మవారి నీ మనసు పూర్తిగా శబరి నది జలాలతో అభిషేకించి వేడుకున్నట్లయితే పెళ్లి గాని వారికి అమ్మవారి ఆశీస్సులతో వివాహం త్వరగా జరుగుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం అందుకే ప్రతి సంవత్సరం అమ్మవారి వార్షికోత్సవ రోజున శబరి నది జలాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి జాలభిషేకం చేస్తారు. ఈ వార్షికోత్సవానికి భక్తులు స్థానికంగా మాత్రమే కాకుండా, పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల నుండి కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. త్రాగునీరు, నీడ కోసం చలవ పందిర్లు , ఇతర సౌకర్యాలను సమకూర్చారు

## అంగన్వాడీ చిన్నారులకు బొమ్మలు ద్వారా బోధనపై శిక్షణ





రాజవొమ్మంగి , ఫిబ్రవరి 23, ప్రభాత వార్త

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు చదువు పట్ల మక్కువను పెంచడంపై బొమ్మలు, చిత్రలేఖనం ( డ్రాయింగ్ ) ద్వారా ఎలా చెప్పవచ్చుననే అంశంపై జ్ఞానజ్యోతి కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ లు పి. సరస్వతి, సూపర్ వైజర్స్ అరుణలత, అమ్మి రాజు, అమ్మాజీ, నాగజయలక్ష్మి లు అంగన్వాడీ వర్కర్లకు వివరించారు. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో వర్కర్స్ చేస్తున్న బోధనపై వేసిన డ్రాయింగ్ లో అంకెలు, పండ్లు, పక్షులు, కూరగాయలు వాటి రంగులు, రూపాలను చార్టుపై వేసి వివరించారు. ఆటపాటలతో బోధనపై వర్కర్స్ నృత్య ప్రదర్శనను చేశారు. చిన్నారులు మేధస్సుకు ఎలా బోధించాలనే అంశంపై రిసోర్స్ పర్సన్ మురళీ కృష్ణ, సత్యనారాయణలు వివరించారు. ఈకార్యక్రమంలో యం.ఇ.ఓ లు కె. వి. వి. సత్యనారాయణదొర, టి. సూరయ్యరెడ్డి, సి. డి. పి. ఓ ఎల్. దేవమణి, ప్రధానోపాధ్యాయులు దినకర్, ఆర్ పిలు బీరబోయిన మురళీకృష్ణ, కోటం సత్యనారాయణ, పి.సరస్వతి, ఐ. సి. డి. ఎస్ సూపర్ వైజర్స్ అరుణలత, అమ్మిరాజు, నాగజయలక్ష్మి, అమ్మాజీ, సిఆర్పీ లు శ్రీనివాస్, విష్ణువర్ధన్, మంగరాజు, ఆదినారాయణరెడ్డి, సతీష్, 101 మంది అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

## బౌడ శివాలయంలో ప్రత్యేక పూజలు

చింతపల్లి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త.



మండలంలోని, బౌడ శివాలయంలో సోమవారం నుంచి బుధవారం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం కమిటీ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రతిరోజు ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చన, హోమాలు నిర్వహించబడతాయన్నారు. ప్రతిరోజు భక్తుల కోసం అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. యావన్మంది భక్తులు ప్రత్యేక పూజలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

## బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ పనిచేయక ఇబ్బందులు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 23, ప్రభాత వార్త

మండలంలో గల జడ్డంగి చుట్టు ప్రక్కల బి. ఎస్. ఎన్. ఎల్ సిగ్నల్ గత నాలుగు రోజులుగా పనిచేయక వినియోగదారులు నానాఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, బ్యాంకుల ఆన్ లైన్ సేవలకు బి. ఎస్. ఎన్. ఎల్ సేవలు ఆధారంగా చెప్పవచ్చు. ఈవిషయంపై సంభంధిత అధికారిని ప్రభాత వార్త ఫోన్ లో వివరణ కోరగా కేబుల్ కట్ అయ్యి సమస్య ఏర్పడిందని చెప్పి రెండు రోజులు గడుస్తున్నా పరిస్కారం కాలేదు. నేడు జె. వనకరాయిలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం సోమవారం అమీనాబాద్ పంచాయితీ వనకరాయి గ్రామంలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం జరుగుతుందని డా. యామిని ప్రియ తెలిపారు.

## చింతూరులో తొలిసారి గ్రెజ్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



చింతూరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

చింతూరులో తొలిసారిగా ఐపిఎల్ తరహా క్రికెట్ పోటీలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. చింతూరు డివిజన్ లో మంచి ప్రతిభ కనపరుస్తున్న క్రీడాకారులను వేలం వేసి, ఎంపిక చేసుకుని చింతూరు క్రికెట్ క్లబ్, ఆర్ జె స్ట్రైక్ ఫోర్స్,యటపాక వారియర్స్, మోతుగూడెం క్రికెట్ క్లబ్,తుమ్మల లైగర్స్, వీఆర్ పురం చాలంజర్స్ జట్లుగా విభజించి లీగ్స్ పద్ధతిలో ఈ టోర్ని నిర్వహిస్తున్నారు. విజేతగా నిలిచిన జట్టుకు మొదటి బహుమతి గా రూ.30000/-, ద్వితీయ బహుమతి రూ. 20000/- దాతల సహాయంతో అందింస్తారు. సీనియర్ క్రీడాకారుల చేతుల మీదుగా ఈ పోటీలు ప్రారంభమయ్యాయి.

## నేడు శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామివారి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం

### వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు రాక

పాడేరు,ఫిబ్రవరి23, ప్రభాతవార్త:



గిరి కైలాసులు శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామివారికి మహాశివరాత్రి ఉత్సవాల పురస్కరించుకుని వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 24 వ తేదీ సోమవారం శివపార్వతుల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయం తరపున శ్రీ ఉమా నీలకంటేశ్వర స్వామివారికి పట్టు వస్త్రములు 101161/, పసుపు కుంకుమలు ఆనవాయితీగా ఆలయ కమిటీ నుంచి పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు సమర్పిస్తారన్నారు , అలాగే భక్తులు వివిధ సంఘాల సభ్యులు స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రములు సారే సమర్పణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నాటు. . తిరుపతి తిరుమల దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో కూడా అనే ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

**మహా శివరాత్రి మహోత్సవ కార్యక్రమాలు:-**

మహాశివరాత్రి సందర్భంగా పాడేరు అతి పురాతన శ్రీ ఉమా నీలకంటేశ్వర స్వామి వారి సమేత శ్రీ శ్రీ శ్రీ రాజ రాజేశ్వరి దేవి దేవాలయంలో మహా శివరాత్రి మహోత్సవాలు ఈ నెల 24 వ తేదీ నుంచి 26 వ తేదీ వరకూ అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడుతెలిపారు. ఈ నెల 24 నుంచి 26 వ తేదీ వరకూ ఆలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు ఆలయ ప్రధాన అర్చకులు రామం ఆద్వర్యంలో నిర్వహించనున్నామని అయన తెలిపారు. 24 వ తేదీన ఉదయం ప్రత్యేక పూజకు,అభిషేకాలు,విఘ్నేశ్వర పూజా తదితర కార్యక్రమాలు,సాయంత్రం గిరిజనుల అరాధ్యదేవత,మణ్యప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీ మోద కొండమ్మ అమ్మవారి ఆలయం తరుపున స్వామి వారికి ఎంపి తనూజరాణి,ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు,మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి,డా.తమర్భ నరసింగరావు,మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి,పాడేరు సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి,పద్మ శాలీ,కాపు,గవర, జంగము,వాసవీ,వాసవీ హిల్స్,గ్రామ పెద్దలు సమక్షంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించే కార్యక్రమం తో పాటు పార్వతీ పరమేశ్వరుల వార్షిక కళ్యాణం,25 వ తేదీన పార్వతీ పరమేశ్వరుల పల్లకీ సేవ ఊరేగింపు కార్య క్రమం,ఈ కార్యక్రమానికి ప్రసాదం వితరణ పాత్రికేయులు ముత్యాల మోహన్ రావు,టీచర్ సత్య శ్యామల దంపతులు,26 వ తేదీన ప్రత్యేక పూజలు,ప్రసాద వితరణ ఉప్పల వెంకట రత్నం,వైదేహి దంపతులు అలాగే 26 వ తేదీ మధ్యాహ్నం ఆలయం ప్రాంగణంలో భారీ అన్న ప్రసాద కార్యక్రమం భక్తుల సహకారం తో నిర్వహించనున్నామనీ ధర్మా కర్త సింహాచలం నాయుడు తెలిపారు. 26 వ తేదీ రాత్రి ఆలయంలో మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నామని అయన తెలిపారు.మహా శివరాత్రి మహోత్సవాలు ఆలయ కమిటీ మరియు ఆధ్యాత్మిక సేవా బృందం ఆద్వర్యంలో జరగనుందని ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు తెలిపారు. ఈ శివరాత్రి మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలనీ సింహాచలం నాయుడు కోరారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం,ఆధ్యాత్మిక సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

### శివరాత్రి పర్వదినాన్న అత్యంత వైభవంగా

## వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం...!

### ఎండోమెంట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఏర్పాట్లు

### ఇక్కడ జరిగే తిరునాళ్లకు సుదూర ప్రాంతాల నుండి రానున్న భక్తులు

### చోళ రాజుల కాలంలో నిర్మించిన అతి ప్రాచీన ఆలయంగా ఓ ప్రసిద్ధి

కూనవరం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :



పవిత్ర గోదావరి తీరాన చోళ రాజుల కాలంలో నిర్మించిన వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం అల్లూరి జిల్లా కూనవరం మండలంలో కుమారస్వామి గూడెం గ్రామ సమీపాన గుట్టపై నుండి ఈ ఆలయంలో శివరాత్రి పర్వదినాన వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరుగుతోంది. ఇక్కడ జరిగే తిరునాళ్లకు అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. మూడు రోజుల పాటు ఈ ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. శివరాత్రి పర్వదినాన ఉదయం నుండే ఆలయానికి భక్తులు పోటెత్తుతారు. మండలంలోని భక్తులే కాక ఇతర మండలాలు, పక్క రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడం ఆనవాయితీ. భక్తులు శివరాత్రి పర్వదినాన మొత్తం జాగారం చేసి ఇక్కడ జరిగే తిరునాళ్లను తిలకించి అర్ధరాత్రి జరిగి మళ్ళీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణంను అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకిస్తారు. ఎండోమెంట్ ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయం ప్రభుత్వం మారడం వల్ల కొత్తగా ఆలయ కమిటీ ఏర్పాటు చేయడం జరగలేదు. ప్రస్తుతం ఏర్పాట్లు ఎండోమెంట్ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నట్లు ఎండోమెంట్ అధికారి సాయిబాబు వెల్లడించారు. శివరాత్రి తిరునాళ్లకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయని, ఆలయాన్ని రంగులతో అలంకరించడంతోపాటు చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు తదితర ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఎక్కడ జరిగే తిరునాళ్లకు పోలీసులు ఉదయం నుండి రాత్రి తెల్లవార్లు విస్తృత బందోబస్తు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిస్థాయిలో బందోబస్తూ నిర్వహిస్తారు.

**ఆలయ విశిష్టత...**

శివరాత్రి పర్వదినాన మూడు రోజులు మాత్రమే ఈ ఆలయంలో దీప నైవేద్యాలతో పాటు వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది. మిగిలిన రోజుల్లో పూజలు ఉండవు. ఈ ఆలయం సమీపంలోనే ధ్వని బండ ఉంది. మండు వేసవిలో సైతం ధ్వని బండలో నీరు సైతం ఉంటుందని ఇక్కడ చెబుతుంటారు. ఈ ధ్వని బండ వద్ద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రశాంతతకు వచ్చి కూర్చుంటారని భక్తుల విశ్వాసం. ఈ ఆలయానికి ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిపై వచ్చే కౌలు, భక్తులు హుండీలో వేసే డబ్బులతోనే పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. అత్యంత ప్రాశ త్యంకల్గిన ఈ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

**కూనవరంలో..**

శబరి, గోదావరి సంగమ సమీపానున్న శివాలయంలో శివరాత్రి పర్వదినాన శివపార్వతుల కళ్యాణం ఘనంగా జరుగుతుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తి అవుతున్నాయి. ఉదయం నుంచే ఈ ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయంలో కూడా నిత్య పూజలు జరుగుతాయి.

## అండిబలో మెగా వాలీ బాల్ టోర్నమెంట్

హుకుంపేట ఫిబ్రవరి23, ప్రభాతవార్త:



హుకుంపేట మండలంలోని అండిబ శ్రీ మత్స్య దేవత జాతర మహోత్సవం సందర్భంగా మెగా వాలీ బాల్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నామని సర్పంచ్ తామర సత్యనారాయణ తెలిపారు. ఆదివారం వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సర్పంచ్ తామర్ల సత్యానారాయణ లు కలసి వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తామర్ల సత్యనారాయణ మాట్లాడుతూ... ఫిబ్రవరి 24,25తేదీ ల్లో మెగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని,వాలీ బాల్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. వాలీబాల్ టోర్నమెంట్ సందర్భంగా గెలుపొందిన వారికి, ప్రధమ బహుమతి గా 20 వేలు,2 వ బహుమతి 10 వేలు,3 వ బహుమతి 5 వేలు ఇవ్వనున్నామని,25 రాత్రి జాతర వేదికపై ప్రైజ్ లు ఇస్తామని తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు (8985762780)మరియు(8500798970) నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు,పెసా ఉపాధ్యక్షుడు పాడి నరసింహ మూర్తి, టీడీపీ యువ నాయకులు సివేరి ఈశ్వర్ రావు,సంసాడ అప్పన్న,పాడి కర్రన్న,బొడ్డ శివ,పీ పెంటన్న, ఫీల్డ్ అసిస్టెంట్ సివేరి సత్యనారాయణ,మేనేజ్ మెంట్ కమిటీ పాడి శివ ప్రసాద్, చిట్టపులి రవీంద్ర పడాల్,గెమ్మెలి కొండబాబు,

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చెన్నుపాటి మంజుల




కంచిలి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కార్యక్రమంనకు హాజరైన ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నూపాటి మంజులతో ప్రచార సమావేశం కోసం కంచిలి మండలం ఎపిటిఎఫ్ యూనిట్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంటిఎస్ రాష్ట్ర ఉపాధ్యాయ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్‌రెడ్డి, రెల్ల కామరాజు, కోరాడ షన్ముఖరావు, నయన్ కుమార్, డిక్కల దామోదర్, లక్ష్మీనారాయణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



రాజాం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

రాజాం పట్టణంలో మార్చి 1 నుంచి జరగబోయే ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్థానిక సీఐ కె.అశోక్‌కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ రాజాం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహిళా జూనియర్ కళాశాల, గాయత్రి జూనియర్ కళాశాల, వేదగాయత్రి, నారాయణ, శ్రీచైతన్య, జిసిఎస్ఆర్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పట్టణంలో పరీక్షలు జరుగుతున్న సమయంలో జిరాక్స్ షాపులు మూసివేయాలని సూచించారు. పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఉండరాదని, అలాగే ఐదు మంది కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉంటే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పాలకొండలో ఎర్రన్నాయుడు జయంతి వేడుకలు



పాలకొండ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

పాలకొండ టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు 68వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాలకొండ టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి ఆధ్వర్యంలో మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు ఖండాపు వెంకటరమణమూర్తి, మాజీ పాలకొండ టౌన్ అధ్యక్షులు గుమ్మిడి సింహాద్రి, నాయకులు, కార్యకర్తలు సమక్షంలో స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు 68వ జయంతి వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఆకుల మల్లీశ్వరి, 2వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి ఆకుల కుమార్, పక్కి రవికుమార్, ఎన్ని బాబ్జి నాయుడు, బుగత పైడిరాజు, గుమ్మిడి గోవిందరావు, పిన్నింటి వెంకటరమణ, సాసుబిల్లి బుజ్జి, శాసపు సర్వారావు, గజపతిరావు, గర్భాన శ్రీను, వీరఘట్టం, పాలకొండ, సీతంపేట మండల నేతలు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం..!



పాలకొండ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

పాలకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కల్వర్టుకు రంధ్రం ఏర్పడడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సులు బయటకు వచ్చే దారిలో కల్వర్టు కూలడానికి సిద్ధంగా ఉంది. వాహనదారులు అదమరిస్తే పెను ప్రమాదం చోటు చేసుకుంటుందని సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టును బాగు చేసి ప్రమాదం నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రఘువర్మకు మద్ధతుగా తెదేపా నేతల విస్తృత ప్రచారం



కొత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశ్యాల మేరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల నియోజకవర్గం శాసనమండలి నుంచి పోటీ చేయుచున్న పాకలపాటి రఘువర్మ మద్ధతుగా కొత్తూరు మండలం తెలుగుదేశం సీనియర్ నాయకులు అగతముడి అరుణ్‌కుమార్, పొత్రకొండ మోహనరావు, మాతల గాంధీ, గెడ్డవలస కమలాకర్, నెల్లి అచ్యుతరావు, ఆరుబోలు దశరధ, నూలు వీరభద్రస్వామి, మీసాల సోమేశ్వరరావు, ముగితి కృష్ణారావు తదితరులు కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్‌లో విస్తృత ప్రచారం చేశారు.

## సంతబొమ్మాళిలో ఘనంగా ఎర్రన్నాయుడు జయంతి వేడుకలు



సంతబొమ్మాళి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

దివంగత మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 68వ జయంతి వేడుకలు ఆదివారం సంతబొమ్మాళిలో ఘనంగా జరిగాయి. తెలుగుదేశం నాయకులు ఆధ్వర్యంలో స్థానిక ఖాదీ బండారు వద్ద ఎర్రన్న చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసేవలో తిరుగులేని నాయకుడుగా పేరొంది మచ్చలేని నేతగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని పలువురు కొనియాడారు. అనంతరం నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్దకు నాయకులు వెళ్లి నివాళులు అర్పించారు. సంతబొమ్మాళి పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చల్ల జగ్గారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు బాడాన రమణమ్మ, మాజీ సర్పంచ్ మెండ అప్పారావు, నీటి సంఘం అధ్యక్షులు అల్లు రమేష్‌కుమార్, బొడ్డేపల్లి సత్యనారాయణ, నారం బోడెన్న, మెండ త్రినాధ్, తంగి భాస్కరరావు పాల్గొన్నారు.

## 31 కిలోల గంజాయితో ఇద్దరు యువకులు అరెస్ట్



ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

స్థానిక రైల్వేస్టేషన్ వద్ద 31 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం.చిన్నంనాయుడు చెప్పారు. గంజాం జిల్లాకు చెందిన ఉపేంద్ర స్వైన్, జ్ఞానేశ్వర్ సేఠీలు ఒడిశా కోడల గ్రామంలో దీపక్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొని గుజరాత్‌లోని సూరత్‌లో అందించేందుకు వెళ్తుండగా వీరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. గంజాయిని సీజ్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్సై ముకుందరావు పాల్గొన్నారు.

## గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దుర్గాప్రసాద్ చెప్పారు. కేసుపురం పంచాయతీ సన్యాసిపుట్టుగ గ్రామంలో మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. నాటుసారా, కల్తీ మద్యం, గంజాయి, బెల్ట్‌షాపులు గురించి మద్యం ఎంఆర్‌పి కంటే ఎక్కువగా అమ్మినా 14405 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇప్పటి వరకు 16 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



వివిధ స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ అన్నారు. ఆదివారం దివంగత నేత, మాజీ కేంద్రమంత్రి ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా మండలం తిలారు గ్రామంలో శ్రీసిమ్మినాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారిచే ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు సుమారు 200 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో 35 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేయడం జరిగిందని వైద్యులు మనీషా తెలిపారు. అంతకు ముందు మాజీ ఎంపీపీ రామకృష్ణ కంటి వైద్యులతో కలిసి కేక్‌ను కట్ చేసి ఎర్రన్నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తర్ర జనార్ధన్, శంకర్ ఫౌండేషన్ సభ్యులు సురేష్, సీ.హెచ్.అశ్వనికుమార్, చాందిని తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో దోమల నివారణకు చర్యలేవి?

### -చోద్యం చూస్తోన్న మున్సిపల్ సిబ్బంది

రాజాం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

రాజాం మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వీధుల్లో మురికినీరు నిల్వ ఉండడంతో దోమల బెడద వెంటాడుతుంది. ఇంత వరకు మున్సిపాలిటీలో ఫాగింగ్ చేసే దాఖలాలు కూడా లేవు. ఈ విధంగా మున్సిపాలిటీ సిబ్బంది మాత్రం ఈ దోమలు నివారణపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో విషజ్వరాలు విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను వివరణ కోరగా స్పందన కొరవడింది. తక్షణమే మున్సిపాలిటీ సిబ్బంది స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టవల్సిందిగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎర్రన్న సేవలు ఎనలేనివి

### కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారి కీర్తి ప్రతిష్టలను తెలియజేసే మహోన్నత వ్యక్తి స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడు 68వ జయంతి ఉత్సవాలు శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఎనలేని సేవలు అందించారని, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకునిగా అటు పార్టీకి, ఇటు ప్రజలకు మరువలేని నాయకత్వం అందించగలిగారని, అతని ఆశయాలు మా అందరికీ మార్గదర్శకమని అన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి, తెలుగు రాష్ట్ర ప్రజలకు ఎనలేని సేవలు అందించారని, ఎన్నటికీ ఈ తెలుగు గడ్డ మరువని నాయకుడని అన్నారు. ఆయన చూపే ప్రేమ అభిమానాలు, గౌరవం రాబోయే భవిష్యత్తుకు కూడా ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవం తీసుకు వచ్చేది తెలుగుదేశంపార్టీ అయితే తెలుగుదేశం పార్టీని మహోన్నత స్థాయికి తీసుకు వెళ్లే ఘనత ఎర్రన్నకి దక్కుతుందని, అన్ని తరాలకు ఆదర్శవంతుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ కేంద్ర మంత్రి ఎర్రన్నాయుడు జయంతి వేడుకలు

### పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి

శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



దివంగత మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి వేడుకలు పలాస టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు రాజకీయాలను శాసించిన కింజరాపు ఎర్రన్నాయుడు అసలు సిసలైన ప్రజల మనిషి. ప్రజల కోసం పని ప్రజా గొంతుకై నిలిచారు. రాజకీయ అరంగేట్రం చేసిన కొద్ది రోజుల్లోనే సిక్కోలు అభిమానించే నాయకుడిగా చెరగని ముద్ర వేసుకున్నారు. రాజకీయాల్లో నిజమైన ఔన్నత్యాన్ని చూపుతూ అందరివాడుగా గుర్తింపు తెచ్చుకున్నారు. సిక్కోలు ఖ్యాతిని అంతర్జాతీయ వేదికలపై చాటిచెప్పిన యోధుడు ఆయన. తన అకాల మరణంతో సింహం లాంటి బిడ్డను జాతికి అందించారు. టైగర్ లాంటి తమ్ముడిని అధినేతకు అప్పగించి అసువులు బాసారు. ఆ మహోన్నత యోధుడు ఈ లోకానికి దూరమై పుష్కరకాలం అవుతున్నా ప్రజల మనసులో మాత్రం సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆదివారం ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా ఆయన సేవలను నెమరువేసుకున్నారు. ఎపీటీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, లోడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, కుత్తుం లక్ష్మణరావు, భావన దుర్యోధన, సూరాడ మోహనరావు, గురిటి సూర్యనారాయణ, వంకల కూర్మారావు, దువ్వాడ శ్రీకాంత్, జోగ మల్లి, కుమ్మరి ఆత్మారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం, ఎచ్చెర్లలో గ్రూప్ 2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిసాయి. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషనర్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు మొత్తం 5535 మంది అభ్యర్థులకు 4715 మంది హాజరు కాగా 820 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన పరీక్షకు 4704 మంది హాజరు కాగా 831 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. రెండు సెషన్స్‌లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా ముగిసాయని కలెక్టర్ వెల్లడించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సాయి ప్రత్యూష కూడా ఉన్నారు.

## చిరస్మరణీయుడు ఎర్రన్నాయుడు

### -ఎర్రన్న ఘాట్ వద్ద అబ్బాయి, బాబాయ్‌లు



కోటబొమ్మాళి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మాజీ కేంద్ర మంత్రి, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు చిరస్మరణీయుడని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర విమానయానశాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడులు అన్నారు. ఆదివారం ఎర్రన్నాయుడు 68వ జయంతి సందర్భంగా తమ స్వగ్రామం నిమ్మాడలో ఎర్రన్నాయుడు ఘాటు వద్దకు మంత్రులు కుటుంబ సభ్యులతో చేరుకుని నివాళులు అర్పించారు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎస్పీ కింజరాపు ప్రభాకర్ తదితరులు ఎర్రన్నాయుడు ఘాటు వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే మాజీ శాసనసభ్యులు గౌతు శ్యామసుందర శివాజీ, శ్రీకాకుళం, పాతపట్నం ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ శాసన మండలి సభ్యులు విశ్వప్రసాద్, టీడీపీ నేతలు బోయిన గోవిందరాజులు, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, మల్ల బాలకృష్ణ, చంద్రవేఖర్ తదితరులు నివాళులు అర్పించారు. అలాగే కోటబొమ్మాళి టీడీపీ పార్టీ కార్యాలయంలో గల ఎర్రన్నాయుడు విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ఇరువాడలో ఘనంగా ముగిసిన ప్రతిష్ట మహోత్సవాలు



వంగర, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మండలం ఇరువాడ గ్రామంలో శ్రీకోదండ రామాలయం పునఃప్రతిష్ట మహోత్సవాలు చిలకలపల్లి వాస్తవ్యులు గురుస్వామి దీక్ష మందారం గ్రంథ సంకలనకర్త శ్రీవిద్యోపాసకులు బ్రహ్మశ్రీ ఆరవెల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు సమక్షంలో ఆలయ కమిటీ గ్రామ పెద్దలు, పురజనుల పర్యవేక్షణలో ఈ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా గురుస్వామి ఆరవెల్లి శ్రీనివాసశర్మ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పరిషత్, ప్రాయశ్చిత్తం, మండప అవాహన, అఖండ దీపారాధన, రక్షాబంధనతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో శ్రీకోదండ రామాలయస్వామి వారి దేవాలయం పునఃప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభించడం జరిగిందని, ఆదివారం ఉదయం శుభ ముహూర్త సమయానికి ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించి అనంతరం శ్రీరామకళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమం అనంతరం గురుస్వామి దీక్షామందారం గ్రంథ సంకలనకర్త బ్రహ్మశ్రీ ఆరవెల్లి శ్రీనివాసశర్మకు దుశ్శాలువలతో గ్రామస్తులు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు మాట్లాడుతూ ఇంటి మహత్తర కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 15 మంది రుత్వికులు, గ్రామపెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ బాపన్నపేట గ్రామానికి చెందిన దుంపల వాసుదేవరావు (24) ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు త్రాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. వాసుదేవరావు గత యేడాది డిసెంబర్ 18న సీమెన్ ఉద్యోగం కోసం ముంబాయి వెళ్లాడు. అయితే అక్కడ నుంచి మూడు రోజుల క్రితం అనారోగ్యంతో బాధ పడుతూ కొన్ని మందులు తీసుకుని ఇంటికి చేరాడు. అందరితో కలిసిమెలిసి తిరుగుతూ ఆదివారం ఉదయం నరసన్నపేటలో ఒక రోగికి పరామర్శించి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నారు. పొలంకు వినియోగించి మిగిలిన పురుగుల మందును తన తండ్రి అప్పన్న ఇంట్లో దాచి పెట్టాడు. ఇంటికి చేరిన వాసుదేవరావు ఆ మందును సేవిస్తుండగా తన తల్లి లక్ష్మి గమనించి పరుగున వెళ్లి మందు డబ్బాను చేతిలోంచి తీసుకుని వెంటనే ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు స్థానిక ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కళాకారుడు జానకిరామిరెడ్డికి ఘన సన్మానం

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



కళాకారుడు, కెమిస్ట్ సోదరుడు, జిల్లా ఈసీ మెంబర్ రంగాల జానకిరాంరెడ్డి దంపతులకు టెక్కలి డివజన్ ఈసీ మెంబర్‌ల ఆధ్వర్యంలో శ్రీకాకుళం డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు శిష్టు జగం చేతుల మీదుగా ఆదివారం సాయికృష్ణ యోగాశ్రమంలో ఘనంగా సన్మానించారు. గౌరవ అధ్యక్షులు శిష్టు జగం, పలువురు ఈసీ మెంబర్లు మాట్లాడుతూ ఇచ్ఛాపురం మండలం మశాఖపురానికి చెందిన ప్రముఖ జానపద సంగీత కళాకారుడు, కెమిస్ట్ సోదరుడు ఈసీ మెంబర్ జానకిరామిరెడ్డి ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఎంతో గొప్ప విశేషమని కళాకారుడు జానకిరామ్‌కి అభినందనలు తెలిపారు. సంగీత సాహిత్య జానపద కళారంగంలో అందించిన విశిష్ట సేవలకు తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక నుంచి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా విజయవాడ శ్రీతుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నంది బహుమతి అందించిన విషయం గుర్తు చేసి ఆయనను సన్మానించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో పేరు ప్రఖ్యాతలు గడించాలని అందరూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జానకిరామిరెడ్డితో పాటు సతీమణి, మాతృమూర్తిలను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈసీ మెంబర్‌లు పాండవ సంతోష్, తర్లాన అశోక్, మహేష్, బాలకృష్ణ, వెంకటరావు, సురేష్, పలువురు ఈసీ మెంబర్లు స్థానిక కెమిస్ట్ సోదరులు ఉన్నారు.

## ఇంటర్ ప్రవేశాలకు ధరఖాస్తులాహ్వానం

నరసన్నపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



నరసన్నపేట మండలంలోని తామరాపల్లి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సెంటినరీ సాంఘిక సంక్షేమ కళాశాల (బాలికలు)లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.వి.కృష్ణతార తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంనకు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్‌మీడియంలో ఎంపీసీ, బైపీసీ కోర్సు నందు మొత్తం 160 సీట్లు భర్తీ కొరకు 10వ తరగతి చదువుతున్న, ఉత్తీర్ణత పొందిన బాలికల నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి మార్చి నెల ఆరో తేదీ వరకు ధరఖాస్తులు స్వీకరించబడునని, మరింత సమాచారంకు తామరాపల్లి కళాశాలలో గాని 9904550010, 9494220920, 9989146554 నెంబర్లకు సంప్రదివచ్చునని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

## కోదండ రాముని శతాబ్ది ఉత్సవాలకు సిద్ధం

ఆముదాలవలస, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



మండలం లొద్దలపేట గ్రామంలో వెలసిన కోదండరామ ఆలయం నిర్మించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు శతాబ్ది ఉత్సవాలు జరిపేందుకు గ్రామస్తులు ముందుకు వచ్చారు. ఉత్సవ ఏర్పాటులో భాగంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఉత్సవ మూర్తులను అలంకరింపజేశారు. నాలుగు రోజుల పాటు గ్రామంలో పెద్దఎత్తున సంబరాలు నిర్వహించేందుకు గ్రామ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటి నుంచి చందాల రూపంలో నగదు పోగు చేసి ఉత్సవాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. శతాబ్ది ఉత్సవాల ఏర్పాటులో భాగంగా కమిటీ సభ్యులు శోభయాత్ర నిర్వహించి గ్రామంలో ఇంటింటికి వెళ్లి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పంచలోహ విగ్రహాల స్థానంలో మూల విరాట్ ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. ఈ ఉత్సవ కార్యక్రమాల్లో గ్రామస్తులు పరిసర గ్రామ భక్తజన యావన్మంది పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

## తనను విధుల్లోకి తీసుకోండి.. ఎమ్మెల్యేకు విన్నపం

ఆముదాలవలస, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



అర్బన్ హెల్త్ కేంద్రాల్లో పని చేస్తున్న తమ గత వైసీపీ ప్రభుత్వం విధులు నుంచి తొలగించడమే కాకుండా 9 నెలల వేతనం అందివ్వలేదని విధులు నుంచి తొలగింపు కాబడిన అర్బన్ హెల్త్ సిబ్బంది ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు విన్నవించారు. ఈ మేరకు శనివారం వారు వినతిపత్రాన్ని అందించారు. ఆముదాలవలస పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ కేంద్రాలు, ఇచ్ఛాపురంలో ఒకటి, అర్బన్ హెల్త్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఈ అర్బన్ హెల్త్ కేంద్రాలు 2008వ సంవత్సరంలో ప్రారంభం అయ్యాయని తాము అప్పటి నుంచి అర్బన్ హెల్త్ కేంద్రాల్లో పని చేస్తూ వస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో ప్రజలకు అర్బన్ హెల్త్ కేంద్రాల తరపున సేవలందించామని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం 2021 సెప్టెంబర్ నెలలో మమ్మల్ని తొలగింపు చేపట్టి అదే ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు వేతనాలు అందివ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న అర్బన్ హెల్త్ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందిని మాత్రమే తొలగించి, మిగతా 10 జిల్లాలో సిబ్బందిని కొనసాగించారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కమ్యూనిటీ ఆర్గనైజర్లును, మెడికల్ అసిస్టెంట్లును కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికీ తమను రాజకీయ కక్షతో విధుల్లోకి తీసుకోకుండా అప్పటి నాయకులు అడ్డుకున్నారని వాపోయారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి మమ్మల్ని కొనసాగించే విధంగా ప్రభుత్వం ద్వారా ఉత్తర్వులు అందివ్వాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్.రాంబాబు, పి.రాజేశ్వరరావు, జి.శ్రీదేవి, ఎస్.సన్యాసిరావు ఉన్నారు.

## శివరాత్రి ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించిన మంత్రులు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



మండలం చిన్నహరిశ్చంద్రపురం శ్రీపంచధామ క్షేత్రంలో ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్న శివరాత్రి మహోత్సవాలకు సంబంధించిన గోడపత్రిక, ఆహ్వానపత్రిక, కరపత్రాలను కేంద్ర పౌరవిమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవ సాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం నిమ్మాడలో ఆవిష్కరించారు. ఉత్సవాలు ఇంత ఘనంగా నిర్వహించినందుకు ఆలయ వ్యవస్థాపకుడు ఉప్పాడ కనకరాజుకు వారు అభినందించారు. కింజరాపు హరివరప్రసాద్, కింజరాపు ప్రభాకర్, వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, పూజారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన రాములవారి నరసింహ సంబరాలు

మెరకముడిదాం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



మండలంలోని గరుగుబిల్లిలో ఆవాల వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన రాముల వారి నరసింహ సంబరాలు నేటితో ఘనంగా ముగిశాయి. ఊటపల్లి అప్పల నాయుడు దాసు పందిరి, పాటలు, తప్పెట గుళ్లతో సంబరాలు అంబరాన్నంటాయి. దెబ్బ గుడ్డి వలస గ్రామానికి చెందిన పేకేటి అప్పారావు గురువు సారథ్యంలో మూడు రోజులు పాటు ఈ సంబరాలు నిర్వహించారు.

## పుణ్యగిరి జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు : ఆర్టీసీ డిఎం

శృంగవరపుకోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



రానున్న మహాశివరాత్రి సందర్భంగా ఎస్.కోట పుణ్యగిరి అలాగే ధర్మవరం శ్రీ సనా్యసేశ్వర స్వామి దేవాలయాల వద్ద జరిగే జాతర మహోత్సవాలలో భాగంగా యాత్రికుల కోసం ఎస .కోట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నామని డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఈ నెల 26వ బుధవారం రాత్రి పర్వదినాన తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 27 సాయంత్రం వరకు పుణ్యగిరికి 15 బస్సులు అలాగే సన్యాసేశ్వరస్వామి దేవస్థానానికి మూడు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. రెండు రోజుల పాటు పగలు రాత్రి 24 గంటలు బస్సులు నడుపుతున్నామన్నారు. ఇక యాత్రికుల రద్దీని బట్టి అదనంగా బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి 15 నిముషాలకు ఆయా దేవస్థానాలకు బస్సులు నడుపుతున్నామన్నారు. ప్రతి 15 నిముషాలకు ఆయా దేవస్థానాలకు బస్సులు నడుపుతున్నామన్నారు. యాత్రికుల ప్రయాణ సౌకర్యార్థం పట్టణంలో దేవిబొమ్మ జంక్షన్ వద్ద అలాగే పుణ్యగిరి కొండ వద్ద ఆర్టీసీ సిబ్బందితో ప్రత్యేక సమాచార కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఈ అవకాశాన్ని యాత్రికులు సద్వినియోగం చేసుకోవాని డిపో మేనేజర్ రమేష్ తెలిపారు.

## రక్తదానంతో ఆరోగ్య ప్రయోజనాలు

గజపతినగరం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



రక్తదానం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ అన్నారు. ఆదివారం గజపతినగరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సహాయ స్ఫూర్తి పౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల రక్తపోటు తగ్గి, గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని, రక్తంలో ఇనుము పరిమాణం తగ్గుతుందని తెలిపారు. రక్తదానం మహాదానమని, ఒకరి ప్రాణాన్ని కాపాడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా బావించి రక్తదానం చేయాలన్నారు. ఈ సందర్భంగా 25 మంది రక్తదాతలు రక్తదానం చేయగా, వారి నుంచి సేకరించిన రక్తాన్ని విజయనగరానికి చెందిన ఎన్.వి.ఎన్ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు విశ్వనాథప్రసాద్, డి.వి.ఆర్.నాయుడు, శ్యామ్, ఎన్.వి.ఎన్ బ్లడ్‌బ్యాంకు మేనేజర్ టి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత వాతావరణం కల్పించి మెరుగైన వైద్యం అందించాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల అప్యాయతను చూపే మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్ పేషెంట్ విభాగం వ్యాక్సినేషన్ ల్యాబ్ టెక్నిషియన్, లేబర్ గదులను నిశితంగా పరిశీలించారు. అడల్ట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో మందుల నిల్వ రక్త పరీక్షలు, వ్యాక్సినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నికిల్ నే ఎనిమియా బాధితుల వివరాలు టవీ రక్త నమూనా పరీక్షల సమగ్ర వివరాల రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. మందులు, యాంటీ స్నేక్ వీనం, రాబిస్ వ్యాక్సిన్‌లు కొంత ఏమైనా ఉందా అనే విషయాలను పార్మసిస్టు సుకన్యను ప్రశ్నించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలపై ఆరా తీయగా గర్భిణీలకు అవగాహన కల్పించడంతో ప్రసవాఉల గణనీయంగా పెరిగాయని పిహెచ్‌సి వైద్యులు కె.కార్తీక్, కె.కీర్తిలు తెలిపారు. పిహెచ్ అన్ని విభాగాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విధంగా పరిశుభ్ర వాతావరణం కల్పించి మెరుగైన వైద ం్య అందించాలని వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మలేరియా కేసులు అరికట్టేందుకు ముందుస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం నిర్మాణం పూర్తి దశలో ఉన్న ఐసోలేషన్ వార్డు భవనాన్ని పరిశీలించారు. విద్యుత్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అక్కడే ఉన్న విద్యుత్ ఏఈని క్షణమే విద్యుత్ సౌకర్యం కల్పించి వైద్య సేవలు అందించేందుకు వీలుగా భవనాన్ని అప్పగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సభ్యుడు కోట భరత్‌కుమార్, జిల్లా ఆర్.డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, తహశీల్దార్ పి.బాల, ఎంపిడివో జి.ఫైడితల్లి, మండల వ్యవసాయ అధికారి రేగిడి విజయభారతి, మండల ఇంజనీరింగ్ అధికారి గోపి గౌరీశంకరరావు, వెలుగు ఏపిఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, ఉపాధి హామీ పథకం మండల గౌరినాద , గ్రామ సచివాలయ కార ్యదర్శి రంభ శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక బృందాలతో గస్తీలు ముమ్మరం : ఎక్సైజ్ సిఐ

చీపురుపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం అక్రమ అమ్మకాలు బెల్ట్‌షాపులు నిరోధానికి ప్రత్యేక బృందాలతో గస్తీలను ముమ్మరం చేస్తున్నామని చీపురుపల్లి ఎక్సైజ్ సిఐ సి.హెచ్.శంకరరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మార్చి నెల రెండు, మూడు, నాలు తేదీల్లో చీపురుపల్లిలో జరగనున్న శ్రీశ్రీశ్రీ కనకమహలక్ష్మి అమ్మవారి జాతరకు సంబందించి తమ శాఖ పరిధిలో ్రత్యేక ఏర్పాట్లుఉ నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. జాతర ప్రాంతంలో ఇటువంటి మద్యం అమ్మకాలు జరగకుండా ప్రత్యేకించి బెల్ట్‌షాపుల నిర్వహణ లేకుండా చర్యలు చేపడుతున్నానన్నారు. ఇప్పటికే బెల్ట్‌షాపులు నిర్వాహకులపైఔన ప్రత్యేక దృష్టి సారించి నిఘా ఏర్పాటు చేశామన్నారు. తమశాఖ పరిధిలో స్పెసల్ ఎన్‌ఫోర్స్మెంట్ సిబ్బందిత పాటు స్థానిక సిబ్బంది కూడా అనుమానిత ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. జాతర ఏర్పాట్లలో భాగంగా స్థానిక పోలీస్‌శాఖాధికారుల సమన్వయంతో సరిహద్దు రపాంతాలలో తాత్కాలిక చెక్‌పోస్టును కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిబంధనపలకు అతిక్రమించి ఏ ఒక్కరైనా అమ్మకాఉ జరిపితితే వారిపైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ వవరించారు. అక్రమ అమ్మకాలపైన ఏదైనా సమాచారం లబిస్తే తమకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

పార్వతీపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



జిల్లాలో ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలకు సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, పిఒ, ఏపిఒ, ఓపిఓ, ఎంఒలకు పిలుపు నిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సంబందిత అధికారులతో కలెక్టర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎంఎల్‌సి పోలింగ్ జరగనుందని అన్నారు. ఈ ఎన్నికలకు 2,333 మంది ఉపాధ్యాయ ఓటరు నమోదు కాగా, అందులో పురుషులు 1,574 మంది మహిళలు 769 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. అత్యధికంగా పార్వతీపురంలో 636, పాలకొండలో 301, సాలూరు 250 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా పాచిపెంటలో 34 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాఉల జిల్లాలో లేనందున ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ హితవు పలికారు. ఎన్నికల నిర్వహణపై ఈ నెల 18వ తేదీన పిలో, ఏపిఓలకు తొలి విడత శిక్షణను ఇవ్వడం జరిగిందని, రెండో విడత శిక్షణ సోమవారం ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధిఆరులు, సూక్ష్మ పరిశీలకులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్వారీ తవ్వకాల వల్ల అన్నదాతలు కుదేలు

దత్తిరాజేరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



మండలంలోని మర్రివలస రెవెన్యూలో సర్వేనెంబర్ 1,2లో క్వారీ త్వకాల వల్ల గత ఐదు సంవత్సరాల నుంచి ఈ ప్రాంతం పంటలు పండక కరువుతో అల్లాడుతున్నామని కొండ చుట్టూ ఉన్న ఆరు ఏడు గ్రామ నాయకులు సుమల గోవింద్‌రెడ్డి, రెడ్డి సింహచలం, చప్ప సత్యనారాయణ, గంజి త్రినాధ, పోతల శంకరరావు, గ్రామ రైతులు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాలు క్రితం ఈ ప్రదేశం పర్యావరణలో చుట్టూ ఎక్కడ చూసినా చెట్లే కనిపించేవి వాటి వల్ల ప్రకృతికి అనుకూలంగా ఉండి రుతుపవనాలు కమ్మి వర్షం పడేది దానివల్ల రైతులకు పంటలు పండి ఆనందంఆ ఉండేవారు రెండు వేల సంవత్సరాల నుంచి క్వారీ త్వకాలు మొదులు పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు వర్షాకాలంలో వర్షాలు పడక పంటలు పండక అన్నదాతలు కుదేలవుతున్నారు. ఎత్తయిన కొండలను చుట్టూ తవ్వేసి పర్యావరణ లేకుండా పొల్యూషన్ దూళ్ళి వల్ల కిడ్నీ జబ్బులు ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. రాత్రి సమయాల్లో బాంబు బ్లాస్టింగ్ రాయి పేల్చడం వల్ల ఎక్కువ శబ్దాలు వల్ల షాపులు వణుకుతున్నాయని షాప్ యజమాని గంజి త్రినాద్ స్థానిక విలేకర్లకు తెలిపారు. లారీలతో క్వారీ రాయి తరలించేటప్పుడు మలుపు వద్ద హైవే రోడ్డు మీద లారీలో నుంచి రాయి కిందికి రాలుతుండటంతో వాహనదారులకు ప్రమాదాఉల జరుగుతాయని వాహనదారులు అంటున్నారు. క్వారీ త్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చేటప్పుడు పబ్లిక్ ఈయరింగ్ పెట్టేటప్పుడు అధికారులు వద్ద నిబంధనలు పాటిస్తామని చెప్పి నిబంధనలకు వ్యతిరేకంగా పనులు జరుగుతునానయని పబ్లిక్ టాక్ క్వారీ మైన్ కూతవేటు దూరంలో 70 ఎకరాలలో నిల్వ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి దాని ద్వారా పక్క రాష్ట్రాలకు విద్యుత్‌ను పంపిణీ చేయడంతో గ్రామాల చుట్టూ కరెంటు వైర్లు వెళ్ళడంతో ప్రాంతం మరి వేడి పొల్యూషన్ ఎక్కువై వర్షాలు పడక పంటలు పండక బతుకే బారంగా ఉందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్వారీ తవ్వకాలు నిలిపే వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## వైభవోపేతంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం

గరివిడి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



స్థానిక సూర్యనందనంలో కొలువైన సూర్యనారాయణ స్వామి ఆలయంలో సూర్య నారాయణ స్వామి కల్యాణం ఆదివారం వైభోపేతంగా జరిగింది. సూర్యసదనం నిర్వాహకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణం ఆద్యంతం భక్తి శ్రద్దలతో సాగింది. వేద పండితులు మంత్రోచ్చారణ వేద ప్రవచనాలతో ఆద్యంతం శాస్రోక్తంఆ కల్యాణ మహోత్సవం కన్నుల పండువుగా సాగింది. సూర్యసదనం 29వ వార్షికోత్స వాన్ని పురస్కరించుకుని జరిగిన వేడుకలో సహస్ర నామాలతో పూజా విదానం అత్యంత వేడుకగా సాగింది. అలాగే శాస్రోక్తంగా సౌరసత్ర యాగం అత్యంత భక్తి ప్రపత్తులతో జరిగింది. భక్తులు కార్యక్రమంలో పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. సూర్యసదన ప్రాంగణ వేద మంత్రోచ్చారణతో మార్మోగింది. ఆద్యాత్మిక తత్వంతో భక్తజనులు పులకించి పోయారు.

## పుణ్యగిరి జాతరకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



మహాశివరాత్రి సందర్భంగా ఎస్.కోట పుణ్యగిరి అలాగే దర్మవరం శ్రీసన్యాసేశ్వరస్వామి దేవస్థానాలు వద్ద రెండు రోజులు పాటు జరిగే జాతర మహోత్సవాలకు ప్రత్యక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయ నున్నామని సిఐ వి.ఎస్.మూర్తి తెలిపారు. డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆయా దేవస్థానాలు వద్ద మొత్తం 300 మందితో కట్టు దిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేయనున్నామన్నారు. ఒకపక్క ఈ నెల 26,27 రెండు రోజుల పాటు మహాశివరాత్రి జాతర ఉత్సవాలు జరగ నున్నాయని మరోపక్క 27వ తేదీన ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండటంతో అందువల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతేకాకుండా సీసీ కెమెరాలు డ్రోన్‌లను ఏర్పాటు చేసి ప్రత్యే నిఘాను ఉంచుతామని జాతరలో ఎవరైనా అల్లర్లు ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ వి.ఎన్‌మూర్తి తెలిపారు.

## పోలీస్‌స్టేషన్‌కు ట్రాఫిక్ భారీ కేడ్లు, స్టీల్ సోఫాలు అందజేత

గజపతినగరం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



స్థానిక పోలీస్‌స్టేషన్ క్రెడిట్ యాక్సెస్ ఇండియా పౌండేషన్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ గజపతినగరం బ్రాంచ్ సంయుక్తంగా తమ కార్పొరేట్ సోసియల్ రెస్పాన్సిబులిటి నిధుల నుంచి ఐదు బారికేడ్లు, త్రీసీటర్ స్టీల్ సోఫాలు రెండు ఆదివారం సబ్ ఇన్‌స్పెక్టర్ కె.లక్ష్మణరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు విశాఖపట్నం డివిజనల్ మేనేజర్ వెంకటరమణ, లైజినింగ్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఏరియా మేనేజర్ చక్రధరరావు, బ్రాంచ్ మేనేజర్ నాగలక్ష్మి, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆమడ దూరంలో బాడాం

మెరకముడిదాం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



కొండలావేరు పంచాయతీ మధుర గ్రామమైన బాడాంలో గత కొన్నేళ్లుగా కాలువలు లేక అపారిశుధ ్యం రాజ్యమేలుతోంది. మురికి నీరు సిసి రోడ్లపై వదలడంతో పేరుకు పోయి నాచుపట్టి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రోడ్లపై వృద్దులు, చిన్నారులు సిసి రోడ్లపై పట్టిన నాచు మూలంగా జారి ప్రమాదం బారిన పడుతున్నారు. అయిఏత కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ పనుల్లో భాగంగా వీధి కాలువలు, సిరి రోడ్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అయితే అరకొర నిధులు మంజూరవ్వడంతో వీరి ఆశలు అడియాలుగానే మిగిలాయి. పల్లె పండుగ పనుల్లో భాగంగా బాడాం గ్రామానికి 15 లక్షలు మాత్రమే మంజూరైంది. అయితే ఈ 15లక్షలతో ప్రదాన రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించారు. ప్రత వీధిలో సిసి రోడ్డుకి ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురికి నీరుతో దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత అయినా తమ గ్రామాలకు మోక్షం కలుగుతుందో లేదో వేచి చూడాల్సిందే.

## మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఈవోపిఆర్‌డి

పాచిపెంట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

మనం నివసిస్తున్న పరిసర ప్రాంతాలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈవోపిఆర్‌డి అన్నారు. మండలంలో గల ప్రతి గ్రామంలోని ఆదివారాల్లో ప్రతి ఇంటింటికి వెళ్ళి పొడి, తడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపదను పొందవచ్చని ఈవోపిఆర్‌డి అనారు. మన పరిసర ప్రాంతాలో పరిశుభ్రంగా ఉంటే రోగాలు బారి నుంచి రక్షించుకోవచ్చని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ పరిశురభం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ండలంలో సచివాలయం పరిధిలో పని చేస్తున్న సిబ్బంది ఆయా గ్రామాల పట్ల అప్రమత్తంగా ఉండే గ్రామాల్లో పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

## సరైన పత్రాలు లేకపోతే చర్యలు తప్పవు

మక్కువ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని స్థానిక చర్చ్ సెంటర్ వద్ద ఆదివారం సాయంత్రం ఎస్.ఐ ఎం.వెంకటరమణ తమ సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని సుమారు 35 మంది వాహనదారులకు ఫైన్ విధించారు. వాహనదారులు తప్పకుండా తమ వెంట పత్రాలను విధిగా ఉంచుకోవాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
వార్త
25 Glorious years

## రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో 'చీకటి పువ్వు'కు ప్రధమ బహుమతి

### ద్వితీయ బహుమతి దక్కించుకున్న 'కొత్త పరిమళం'

నెల్లిమర్ల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



నగర పంచాయితీ పరిధిలోని జరజాపుపేటలో గత మూడు రోజుల పాటుజరిగిన ఆరిపాక బ్రహ్మానందం స్మారక రెండు రాష్ట్రాల నాటిక పోటీల్లో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శించిన చీకటి పువ్వు నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవాసంఘం కళాకారులు ప్రదర్శించిన కొత్త పరిమళం నాటికకు లబించింది. కాగా తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశాఖ పట్నం తెలుగు కళా సమితి కళాకారులు ప్రదర్శించిన నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటిక నిలిచింది. శనివారం అర్ధరాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలక డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, నగర పంచాయితీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గ్రామ పెద్దలు అవనాపు సత్యనారాయణ, ఎం.ఎం.నాయుడు, నల్లి శేఖర్, జనా ప్రసాద్, మద్దిల వాసు, మద్దిల సన్యాసిరావు, కాళ్ల రాజశేఖర్ తదితరులు అందజేశారు.న్యాయమూర్తులు ప్రకటించిన విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తమ దర ్శకుడుగా మంచాల రమేష్ (చీకటి పువ్వు), ఉత్తమ రచయితగా కెకెఎల్ స్వామి (కొత్త పరిమళం), ఉత్తమ నటుడుగా పి.వర ప్రసాద్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత?)లకు లభించాయి. ద్వితీయ ఉత్తమ నటుడుగా డి.గిరిబాబు (చీకటి పువ్వు), ఉత్తమ నటిగా జి.లహరి (చీకటి పువ్వు), ద్వితీయ ఉత్తమ నటిగా డి.హేమ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత ?), ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా రాంబాబు (నిశ్శబ్దమా నీ ఖరీదెంత?) ఉత్తమ సహాయ నటుడుగా శోభన్ బాబు (కొత్త పరిమళం), ఉత్తమ విలన్‌గా చలం (కొత్త పరిమళం), ఉత్తమ హాస్యనటుడుగా బి.కన్నబాబు (నిశ్శబ్దమా నీ ఖరీదెంత?)కు బహుమతులు లభించాయి. ఉత్తమ రంగాలంకరణ గా రమణ (కొత్త పరిమళం), ఉత్తమ సంగీతం లీలామోహన్ (చీకటి పువ్వు), ఉత్తమ ఆహార్యం రమణ (కొత్త పరిమళం)లకు దక్కాయి.జూరీ బహుమతులు సత్యనారాయణ (దేవరాగం), డి.రాధాకృష్ణ (ఎడారిలో వానచినుకు), భుజంగరావు (రైతే రాజు)కు లభించాయి. అతిధుల చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిరే ్ణతలుగా కుసుమాల నాగభూషణం, కె.వి మంగారావు, మానాపురం సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సముద్రపు రామారావు, అవనాపు సత్యనారాయణ, ఎం.ఎం.నాయుడు, నల్లి బంగారు చంద్రశేఖర్, తుమ్ము వెంకటరమణ,అవనాపు మురళీకృష్ణ,జనా ప్రసాద్, మద్దిల వాసు,ఉపాధ్యాయులు కాళ్ల అప్పారావు, మద్దిల సన్యాసిరావు, టిడిపి నాయకుడు, కాళ్ల రాజశేఖర్, దొంక కృష్ణ, సుంకర ముత్యాలనాయుడు, కనకల హైమావతి, నిర్వాహక కమిటి ప్రతినిధులు ఈపు విజయ్‌కుమార్, ఆరిపాక శ్రీనివాసరావు, ఆరిపాక రాము తదితరులు పాల్గొన్నారు.

## శివాలయానికి డాక్టర్ కుమారస్వామి రూ.50 వేలు విరాళం

నెల్లిమర్ల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



మ ండలంలోని సారిపల్లి లోని భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో 49 రోజులు పాటు జరుగుతున్న శివ పంచాక్షరీ మహా మంత్ర అఖండ నామ సప్త సప్తాహం అన్నదాన కార్యక్రమానికి విజయనగరానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ మంచు కుమారస్వామి 50వేల రూపాయిల విరాళాన్ని అందజేశారు. ఆదివారం ఆ ఆలయానికి వెళ్లి ఆలయ కమిటి ప్రతినిధులకు డాక్టర్ కుమార స్వామి ఈ మొత్తా్న్ని నేరుగా అందజేశారు. ఆలయ కమిటి ప్రతినిధులు డాక్టర్ కుమార స్వామికి మర్యాద పూర్వకంగా ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మరో దాత, విజయనగరం జైత్ర కనస్ట్రక్షన్ ్ అధినేత ఆల్తి శ్రీనివాసరావుతో పాటు ఆలయ కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.ఆల్తి శ్రీనివాసరావు కూడా గతంలో ఈ కార్యక్రమానికి 50వేల రూపాయిలు విరాళంగా అందజేశారు.

## హృద్రోగంపై నిపుణత అవసరం

బొబ్బిలి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

హృద్రోగంపై యువ వైద్యులు నిష్ణ ణత అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ కార్డియాలజీ డాక్టర్‌గుల్ల సూర్యప్రకాస్ కోరారు. ఆదివారం స్థానిక టిబిఆర్ పంక్షన్ హాలులో శనివారం అధివారం రెండురోజులు పాటు బొబ్బిలిఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ గుల్ల రామ నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యువ, నిష్ణాతగల డాక్టర్లు హజరై అవగాహనలో పాల్గొన్నారు. డాక్టర్ గుల్ల సూర్య ప్రకాస్ వెనకబడిన జిల్లా అయన పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం రావుపల్లికి చెందినవాడు అయన ప్రధానమంత్రులు, రాష్ట్రపతులతో సన్మానింపబడ్డారంటే ఆయనలో ఉన్న నిపుణత ఆయనలో ఉన్న నైపుణ్యం ఆమెరికా, వంటిదేశాలు మెచ్చుకొన్నాయన్నవి మన ప్రాంత ప్రజలకు విధితమే అన్నారు. ఆయన మాట్లాడుతూ వైద్యవృత్తిలో ఆఫ్షిషిషల్ అవసరం ఎప్పటికప్పుడు నైపుణ్యం పెంచుకొని వృత్తి ధర్మాన్ని పాటించి భావితరాలకు ఆదర్శంగా ఉండాలని కోరారు. వృత్తి నైపుణ్యంపై నిష్ణాతుల ఆలోచన మోధా శక్తి ఆవగాహన చేసుకోవలసిన ఆవస్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఐఎం ఏకార్యదర్శి దివాకర్‌బాబు,కోశాదికారి కృష్ణకుమార్, ప్రముఖ కంటి వైద్యులు కెవి అప్పారావు, రామ మోహనరావు,గేదిల శశిభూషనరావు,బి కాశినాయుడు, రాష్ట్రనలుమూల నుంచి యువ డాక్టర్లు పాల్గొన్నారు. దిగ్విజయంగా పూర్తి చేసినందుకు రామనరేష్ వారిసభ్యులు అందరి ప్రశ ంసలు అందుకొన్నారు.

## బానుచెస్ట్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు

విజయనగరం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



పట్టణంలో రెడ్‌క్రాస్ వారి ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయ వృద్దుల ఆశ్రమానికి డాక్టర్ భానుప్రకాష్ వెళ్ళి వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. వారితో తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడున్న వృద్దులకు ఎటువంటి వైద్య పరమైన ఇబ్బందులు ఉన్నట్లయినా నేనున్నాంటూ డాక్టర్ భరోసా ఇచ్చారు. రాబోయే వేసవి గురించి తగుజాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీమణి వెంకట రమ ్య అవనాపు సత్యనారాయణ, గణపతి రమణబాబు, హరీష్, పిఆర్ఒ జీవన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ముమ్మరంగా పారిశుద్ధ్యం పనులు

మక్కువ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



ఎంపిడివో డిడి స్వరూపారాణి, ఈవోపిఆర్‌డి దేవకుమార్ ఆధ్వర్యంలో మక్కువ మండల కేంద్రంలో పంచాయతీలో ఆదివారం ఇంటింటి చెత్త సేకరణ చేస్తూ ప్రజలకు అవగాహన పంచాయతీ కార్యదర్శి సురేష్ నిర్వహించారు. దీనిల భాగంగా పంచాయతీలో ఉదయం 6 గంటల ఉంచి గ్రామంలో ఉన్న ్రతి ఇంటికి వెళ్ళి చెత్త సేకరణ చేయడం జరిగింది. ఇందులో భాగంగా తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా తీసుకోవడం, అది చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించి అక్కడ చెత్త నుంచి సంపద తయారీ చేయడంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.

## శ్రీ శ్యామలాంబ ప్రతిరూపం సిరిమాను చెట్టు ఊరేగింపు

సాలూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



సాలూరు పట్టణ ప్రజల ఇలవేల్పు శ్రీ శ్యామలాంబ అమ్మవారి పండుగ సందర్భంగా అమ్మ ప్రతిరూపమైన సిరిమాను చెట్టును కమిటీ సభ్యులు ఊరేగింపు నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం శ్యామలామ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు శివాజీ బొమ్మ సంటర్ మీదుగా డబ్బివీధి, కోటజంక్షన్, డీలక్స్ సెంటర్ మెయిన్‌రోడ్డు గుండా నాయుడు వీధి రామ మందిరం వద్దకు సాగింది. అలాగే మహిళలు అడుగడు గునా సిరిమాను చెట్టుకు పసుపు కుంకుమలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ తిరువీధిలో ఉత్సవ కమిటీ సభ్యులు పట్టణ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

